




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 | సంచిక : 199 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | మంగళవారం 25 మార్చి 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda







## బీఆర్ఎస్ పని అయిపోయింది



- బీఆర్ఎస్ భవిష్యత్తుపై కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని ఎద్దేవా
- ఒకవేళ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఛాలెంజ్
- ఈ ఛాలెంజ్ కు కేటీఆర్ సిద్ధమేనా అంటూ ప్రశ్నించిన మంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పని అయిపో యిందని, మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి రావడం కల మాత్రమేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వందకు వంద శాతం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం

వివరాలు 2లో..



# ఎల్ఆర్ఎస్ గడువు పొడగించం..
# త్వరలో భూ వ్యాల్యూ పెంపు

- తెలంగాణలో పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- ఇప్పటికైతే గడువు పెంచే యోచన లేదన్న మంత్రి
- ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్పందన కనిపిస్తోందన్న మంత్రి
- భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎల్ఆర్ఎస్ స్కీమ్?పై మంత్రి పొంగులే టి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువు 2025, మార్చ్ 31 వరకు ఉందని.. ఆలోపు చేసుకు న్న వారికి 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని తెలిపా రు. ఇప్పటికైతే ఎల్ఆర్ఎస్ గడువు పొడగించే ఆలోచన లేదని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పర్మిషన్ ఇప్పుడు కాకుండా ఇళ్ళు కట్టేటప్పుడు కావాలంటే అప్పుడు 100 శాతం ఎల్ఆర్ఎస్ కట్టాల్సి ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్?కు ఆశించిన మేర స్పందన ఉందని తెలిపారు. సోమవారం (మార్చి 24) మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. త్వరలో భూ వ్యాల్యూ పెంచబోతున్నామని తెలిపారు. త్వరలో భూ సర్వే కోసం ప్రతీ మండలానికి సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్?ను నియమిస్తామని.. అలాగే లైసెన్డ్ సర్వేయర్?లకు అవకాశం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల మంది లైసెన్డ్ సర్వేయర్?లు ఉన్నారని వీరికి ట్రైనింగ్ ఇచ్చి అవకాశం కల్పిస్తామన్నారు.

**సాదాబైనామాల కొత్త దరఖాస్తుల స్వీకరించం:**

సాదా బైనామాలపై మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. సాదాబైనామాల విషయంలో కొత్త దరఖాస్తు లను స్వీకరించమని తేల్చి చెప్పారు. పాత దరఖాస్తు లలో 13 లక్షల అప్లికేషన్లను గత ప్రభుత్వం రిజక్ట్ చేసిందని.. దరఖాస్తు తిరస్కరణకు గురైనవారు అప్పిలేట్ ఆథారిటిలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. కేంద్రం ప్రధాని అవాస్ యోజన కింద అర్బన్ ఏరియాలో 1 లక్ష 13 వేల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. అర్బన్ ఏరియాలో కట్టే ఇళ్లకు కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుందని.. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రూరల్ ఏరియాకు సంబందించి కేంద్రం ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో ఏ సమస్య లేదు:**

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపై మంత్రి పొంగులేటి క్లారిటీ ఇచ్చారు. నాకు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి మధ్య ఎలాంటి సమస్య లేదని చెప్పారు. అనిరుధ్ రెడ్డితోనే కాకుండా ఇతర ఏ ఎమ్మెల్యేతో నాకు విభేదాలు లేవని వివరణ ఇచ్చారు. నేను ఏ వ్యక్తి పట్ల భేదం చూపించ కుండా జన్యున్? పని చేశానని తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్ చెబుతున్న అభిమన్యు రెడ్డి అనే వ్యక్తి ఎవరో నాకు తెల్వదని క్లారిటీ ఇచ్చారు.

## తెలంగాణ నుంచి అప్పటి వరకు రిలీవ్ చేయవద్దు

### ఐపీఎస్ అధికారి మహంతికి హైకోర్టులో ఊరట

- ఏపీలో రిపోర్టు చేయాలంటూ కేంద్ర హెూంశాఖ ఉత్తర్వులు
- క్యాట్‌లో విచారణ తేలేవరకు రిలీవ్ చేయవద్దన్న హైకోర్టు
- మహంతి పిటిషన్‌ను త్వరగా విచారించాలని క్యాట్‌కు ఆదేశాలు

వివరాలు 2లో..



## జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కనిపించడం లేదంటూ బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు!



- జీహెచ్ఎంసీ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ శ్రవణ్
- జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలపై ఆమె దృష్టి సారించడం లేదని ఆవేదన
- కనీసం కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు

**హైదరాబాద్ పెన్ పవర్:**జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కనిపించడం లేదని మల్కాజ్‌గిరి బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ సోమ వారం ప్రజావాణి కార్యక్రమంలో

వివరాలు 2లో..

## తమిళనాడులోకి జనసేన ఎంట్రీ.. పవన్ సంచలనం!

- తమిళనాడులోకి జనసేన ఎంట్రీపై... పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- ప్రజలు కోరుకుంటే తమిళనాడులోకి జనసేన అడుగుపెడుతుందన్న పవన్
- సినీ నటులు రాజకీయాల్లో గెలవడం అంత ఈజీ కాదని వ్యాఖ్య
- విజయ్, పళనిస్వామి కెమిస్ట్రీ వర్కౌట్ అవుతుందో? లేదో? చెప్పలేనన్న పవన్

వివరాలు 2లో..



## కాంగ్రెస్ సర్కారుకు జగదీశ్ రెడ్డి మాస్ వార్నింగ్

- మందబలంతో అసెంబ్లీని నడుపుతామంటే కుదరదన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే
- పద్ధతీ పాడు లేకుండా సభ నడిపిస్తున్నారని మండిపడ్డ మాజీ మంత్రి
- తన సస్పెన్షన్ కు సంబంధించి బులెటిన్ ఇవ్వాలని డిమాండ్



వివరాలు 2లో..

## ఎస్ఎల్బీసీ సహాయక చర్యలు... రేవంత్ కీలక ఆదేశాలు

- సహాయక చర్యల పర్యవేక్షణకు సీనియర్ ఐఏఎస్ ను నియమించాలన్న రేవంత్
- సహాయక చర్యలు త్వరగా జరిగేలా చూడాలని ఆదేశం
- నిపుణుల సలహాలతో ముందుకు వెళ్లాలని సూచన



వివరాలు 2లో..

## మన దేశంలో ఎంపీల జీతాలు పెరిగినయ్..

### ఇకపై నెలకు లక్ష కాదు.. అంతకు మించి..

- ఎంపీల జీతం రూ.1 లక్ష నుంచి రూ.1.24 లక్షలకు పెంపు
- రోజువారీ భత్యం రూ.2,000 నుంచి రూ.2,500కు పెంపు
- మాజీ ఎంపీల పింఛన్ రూ.25,000 నుంచి రూ.31,000కు పెంపు
- అదనపు పింఛన్ రూ.2,000 నుంచి రూ.2,500కు పెంపు
- 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తింపు
- ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

వివరాలు 2లో..



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సభ్యుల వేతనాలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా ఎంపీల జీతాలు, అలవెన్సులు, పింఛన్లను సవరించింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పెంచిన వేతనాలు, అలవెన్సులు 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం... లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల జీతం నెలకు రూ.1 లక్ష నుంచి రూ.1.24 లక్షలకు పెరిగింది. అలాగే, రోజువారీ భత్యం రూ.2,000 నుంచి రూ.2,500కు పెంచారు. అంతేకాకుండా, మాజీ ఎంపీల పింఛన్‌ను నెలకు రూ.25,000 నుండి రూ.31,000కు పెంచారు. ఐదేళ్ల సర్వీసు తర్వాత ప్రతి సంవత్సరం అదనపు పింఛన్‌ను రూ.2,000 నుండి రూ.2,500కు పెంచినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల





- మే 1తో ముగియనున్న ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం
- ఈ నేపథ్యంలో తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మార్చి 28న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 4 నామినేషన్లు దాఖలుకు ఆఖరి గడువు
- ఏప్రిల్ 23న పోలింగ్.. 25న ఎన్నికల ఫలితాలు

వివరాలు 2లో..

## బాధ్యత గల పౌరురాలిగా ఇక అలాంటి పనులు చేయను

- బెట్టింగ్ యాప్ లు ప్రమోట్ చేసిన కేసులో విచారణకు హాజరైన శ్యామల
- ఇకపై బెట్టింగ్ లు ప్రమోట్ చేయనని వ్యాఖ్య
- విచారణకు పూర్తిగా సహకరిస్తానన్న శ్యామల



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆన్ లైన్ బెట్టింగ్ ను ప్రమోట్ చేశారనే కేసులో వైసీపీ నాయకురాలు, యాంకర్ శ్యామల పోలీసు విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో శ్యామలను పోలీసులు దాదాపు రెండున్నర గంటలకు పైగా విచారించారు. విచారణ ముగిసిన అనంతరం మీడియాతో శ్యామల మాట్లాడుతూ... బెట్టింగ్ ను ఇకపై ప్రమోట్ చేయనని చెప్పారు. బాధ్యతగల పౌరురాలిగా ఇలాంటి వాటికి దూరంగా ఉంటానని చెప్పారు. బెట్టింగ్ యాప్స్ ద్వారా ప్రాణాలు కోల్పోయిన వారి లోటును ఎవరూ భర్తీ చేయలేరని అన్నారు.

వివరాలు 2లో..

## మిస్ వరల్డ్ పోటీలు..

### హైదరాబాద్‌కు 140 దేశాల అందాల భామలు.. మొత్తం ఖర్చు రూ.54 కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్::** అందమైన భాగ్యనగరం అందాల పోటీలకు వేదికగా మార నుంది. 72వ మిస్?వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. మే 7 నుంచి 31 దాకా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. 25 రోజుల పాటు 22 ఈవెంట్లు నిర్వహించనున్నారు. ప్రపంచం నలు మూలల నుంచి 140 దేశాలకు చెందిన కంటెస్టెంట్లతో పాటు ఆయా దేశాలకు చెందిన ప్రముఖ క్రీడాకా రులు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, కళాకారులు.. ఇలా విభిన్న రంగాలకు చెందినవారు తరలిరానున్నారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# రాజకీయ పార్టీల పేరుతో బోగస్ ఐటీ క్లెయిమ్స్...

దేశంలో రిజిస్టర్ అయి గుర్తింపులేని రాజకీయ పార్టీలు ఫుల్ జోరుమీదున్నాయి. ఓట్ల రూపంలో కాదు.. ఫండింగ్ లో. అవును మీరు వింటున్నది నిజమే.. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కూడా వీటి ముందు దిగదుడుపే మరి. నిజానికి రాజకీయ పార్టీ పెట్టిన వారు ఏం చేయాలి.. ఎన్నికలు వస్తే అభ్యర్థులను పోటీకి పెట్టాలి. జనంలోకి వెళ్లి ప్రచారం చేయాలి. మరి వీటికి జనం ఇచ్చే విరాళాలే కీలకం. అందుకే ఫండింగ్ తీసుకుంటాయి. పార్టీని రన్ చేసుకుంటాయి. కానీ ఈసీ గుర్తింపులేని, అడ్రస్ లేని కొన్ని రాజకీయ పార్టీలు.. విచిత్రంగా.. ఎన్నికల్లో ప్రచారం చేయడం కంటే.. పార్టీకి విరాళం ఇవ్వడం వల్ల కలిగే ఐటీ మినహాయింపు బెనిఫిట్స్ గురించి ఫుల్ జోష్ తో ప్రచారం చేస్తుంటాయి. ఎందుకంటే వారి లెక్కలు వారికి ఉన్నాయి మరి. జస్ట్ పొలిటికల్ ఫండింగ్ కోసమే నడిచేవి పెరుగుతున్నాయనడానికి తాజాగా బయటికొస్తున్న బోగస్ క్లెయిమ్ లెక్కలే నిదర్శనం.. కానీ చాలా మంది ఇదే లూప్ హోల్ ను అడ్డం పెట్టుకుని బోగస్ క్లెయిమ్ గేమ్ నడిపిస్తున్నారు. ఇందుకోసం పొలిటికల్ పార్టీలను వాడుకుంటున్నట్లుగా తేలింది. 2022 నుంచి 2024 మధ్య ఏకంగా పది వేల కోట్ల రూపాయల స్కాం నడిచిందన్న మ్యాటర్ తెరపైకి వచ్చింది.మనది ప్రజాస్వామ్య దేశం. రాజకీయ పార్టీ పెడితే కామన్ మ్యాన్ కు లేని బెనిఫిట్స్ ఎన్నో వచ్చి పడుతాయి. మొన్నటిదాకా పార్టీలకు విరాళం ఎవరు ఇస్తున్నారో కూడా తెలియకపోయేది. సుప్రీం తీర్పుతో ఇది మారింది. సో సరిగ్గా ఇలాంటి బెనిఫిట్స్ ను క్యాష్ చేసుకునేందుకే రాజకీయ పార్టీ అవతారం ఎత్తుతారు కొందరు. జస్ట్ పాన్ డబ్బా మాదిరిగా పార్టీ ఆఫీస్ ఉంటుంది. ఒక కుర్చీ, ఒక టేబుల్ అంతే. అది కూడా సాదాసీదా ఏరియాల్లోనే. చుట్టు పక్కల వారికి కూడా ఏం డౌట్ రాదు. కానీ ఆ పార్టీ అకౌంట్లలో మాత్రం లక్షలు, కోట్ల ట్రాన్సాక్షన్స్ ఆ డబ్బా ఆఫీస్ నుంచే నడిపిస్తుంటారు. అక్కడే గేమ్ ఉంది మరి. ఇక్కడ మనం అన్ని గుర్తింపు లేని పార్టీలను పాయింట్ అవుట్ చేయడం లేదు. ఐటీ నిఘాలో తేలిన విషయాలనే ప్రస్తావిస్తున్నాం.మూడేళ్లలో ఏకంగా 10 వేల కోట్ల రూపాయల మేర స్కాం నడిచినట్లు ప్రాథమికంగా ఐడెంటిఫై చేసింది.2022 నుంచి 2024 వరకు రెండేళ్లలో 3,260కి పైగా ఇలాంటి పార్టీలకు ఇంత మొత్తం ఫండింగ్ గా వచ్చిందని తేలింది. రాజకీయ పార్టీలు విరాళాలు సేకరించడం తప్పు కాదు. కానీ పోటీ పెట్టకుండా, ఖాతాల నుంచి డబ్బును ఎక్కడికి తీసుకెళ్తున్నారు.. ఎటు మళ్లిస్తున్నారో చూస్తే అసలు డౌట్లన్నీ బయటికొస్తున్నాయి. షెల్ కంపెనీలకు వెళ్తున్నట్లు, థర్డ్ పార్టీలకు చేరుతున్నట్లుగా ఐటీ శాఖ గుర్తించింది. నిజానికి గుర్తింపు లేని పార్టీల్లో 75 శాతం అసలు పోటీనే పెట్టడం లేదని సాక్షాత్తూ ఎన్నికల సంఘమే గుర్తించింది. ఇందులోనూ 90 శాతం పార్టీలు ట్యాక్స్ బెనిఫిట్స్ కోసం కచ్చితంగా ఇవ్వాల్సిన రిపోర్ట్స్ ను రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇవ్వట్లేదని ఐడెంటిఫై చేశారు.ఈసీ గుర్తింపు పొంది, దేశ రాజకీయాలను శాసిస్తున్న జాతీయ, ప్రాంతీయ పార్టీల కంటే గుర్తింపు లేని పొలిటికల్ పార్టీల ఖజానా గలగలలాడుతోంది. ఒక్కసారి ఆ లెక్కలు చూద్దాం. 2025 జనవరిలో ఎన్నికల సంఘం తన తాజా ఆడిట్ రిపోర్ట్ లో ఇచ్చిన లెక్కల ప్రకారం బిజెపి వద్ద 7,113 కోట్ల క్యాష్, అలాగే బ్యాంకు బ్యాలెన్స్ ఉంది. అదే కాంగ్రెస్ వద్ద 857.15 కోట్ల రూపాయలున్నట్లు తేలింది. సో ఈ లెక్కలతో పోల్చితే గుర్తింపులేని పార్టీల మ్యాటర్ జోరుగా ఉంది. మరో విషయం.. సీబీడీటీ కూడా ఈ లెక్కల్ని కాలిక్యులేట్ చేయగా.. ట్యాక్స్ పేయర్స్ ఇస్తున్న విరాళాలకు.. ఫండింగ్ తీసుకుంటున్న గుర్తింపులేని రాజకీయ పార్టీలు చూపిస్తున్న లెక్కలకు అస్సలు మ్యాచింగ్ కుదరట్లేదు. సో ఎలక్టోరల్ ఫండింగ్ ను దుర్వినియోగం చేస్తున్నారని అఃఆ హైలెట్ చేసింది.గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు 5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విరాళాలు ఇచ్చిన వారిని ఐటీ శాఖ లిస్టవుట్ చేసింది. 2022-23లో దాతలు ఐటీ చట్టంలోని 80ఉఉః అలాగే 80ఉఉఅ కింద కలిపి 10,975 కోట్ల రూపాయలకు పైగా పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసినట్లు ఐటీ డేటా చెబుతోంది. రాజకీయ పార్టీలు ప్రకటించిన విరాళాల లెక్కలు చూస్తే కేవలం 4,858 కోట్ల రూపాయలు మాత్రమే ఉంది. అదే సమయంలో 6,116 కోట్ల విరాళాలు అందుకున్నట్లు గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఎందుకు బయటపెట్టలేకపోయాయన్న ప్రశ్నలు అలాగే ఉన్నాయి. వీటిని ఎన్నికలు ప్రచారం వంటి వాటికి ఖర్చు చేయకుండా వేరే అవసరాలకు మళ్లించినట్లు స్పష్టంగా అర్థమవుతున్న విషయం. ఐటీ శాఖ డౌట్లు పెరగడం, స్క్రూటినీ పెంచడంతో 2023-24లో అదనపు విరాళాల సంఖ్య సగానికి తగ్గి 3,053 కోట్లుగా లెక్క తేలింది. సో పన్ను మినహాయింపు కోరుకునే నెంబర్ ఒకలా ఉంటే.. పార్టీలు చూపిస్తున్న స్లిప్స్ మాత్రం ఇంకోలా ఉంటున్నాయి. లెక్క కుదరడం లేదు. గుర్తింపులేని రాజకీయ పార్టీలకు హైదరాబాద్ కు చెందిన పలువురు సాఫ్ట్ వేర్ నిపుణులు పెద్ద మొత్తంలో ఫండింగ్ చేస్తున్నట్లు లేటెస్ట్ గా ఇన్ కమ్ ట్యాక్స్ డిపార్ట్ మెంట్ దృష్టికి వచ్చింది. ఇలాంటి పార్టీలపై ఐటీ నిపుణులకు ప్రేమ ఎందుకు పెరిగిందో చూస్తే అసలు లెక్కలన్నీ బయటపడ్డాయి. విరాళాలు ఇచ్చినట్లు నటిస్తూ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80ఉఅని వాడుకుని క్లెయిమ్ చేసుకున్నట్లు గుర్తించారు. ఇలా హైదరాబాద్ సిటీలోని 36 కంపెనీలకు చెందిన వారిలో ఎక్కువ వేతనాలు ఉండే ఐటీ నిపుణులు ఇలా విరాళం ఇచ్చి ట్యాక్స్ మినహాయింపు కోసం 110 కోట్ల రూపాయల రీఫండ్ కు అప్లై చేసినట్లు ఐటీ శాఖ దర్యాప్తులో తేలింది.ఏడాది 46 లక్షల రూపాయల వేతనం ఉన్న సాఫ్ట్ వేర్ ఎంప్లాయి.. ఒక గుర్తింపు లేని రాజకీయ పార్టీకి 45 లక్షల విరాళం ఇచ్చినట్లు క్లెయిమ్ చేయడంతో ఐటీ శాఖ లోతుగా దర్యాప్తు చేసి ఈ మ్యాటర్ ను బయటపెట్టింది. ఇలాంటి మోసపూరిత రిఫండ్ క్లెయిమ్స్ పై ఐటీ శాఖ నజర్ పెట్టడంతో చాలా వరకు తగ్గాయి. అయినా సరే కొందరు ఎవరికీ దొరుకుతాం అన్న ఉద్దేశంతో రెచ్చిపోతూనే ఉన్నారు. కమీషన్లు తీసుకుని విరాళాలు స్వీకరిస్తున్న గుర్తింపులేని రాజకీయ పార్టీలు ఎక్కువగా గుజరాత్, తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాల్లో ఉన్నట్లు ఐడెంటిఫై చేశారు. ఇలా తప్పుడు క్లెయిమ్ లు చేసిన వారు ఎవరైనా ఉంటే.. 200 శాతం ఫైన్ నుంచి తప్పించుకునేందుకు మార్చి 31, 2025 లోపు అప్డేట్ చేసిన ఐటీ రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే ఐటీ శాఖ ఫైన్ సహా శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఐటీ సెక్షన్ 80 జీజీసీని దుర్వినియోగం చేయొద్దని ఐటీ శాఖ అలర్ట్ చేస్తోంది. ఇలా నకిలీ విరాళాలు ఇస్తూ పన్ను రిటర్న్ లలో మోసపూరిత క్లెయిమ్స్ చేయొద్దని సూచిస్తున్నారు. ఈ చర్యలు ఫలించి డిసెంబర్ 2024 వరకు, దాదాపు 90 వేల మంది పన్ను చెల్లింపుదారులు తప్పుడు తగ్గింపు క్లెయిమ్‌లను ఉపసంహరించుకున్నారు.చట్టం ప్రకారం, పన్ను నుంచి తప్పించుకోవడానికి రాజకీయ పార్టీకి విరాళం ఇవ్వగల మొత్తానికి ఎలాంటి పరిమితి లేదు. ఇది కూడా చాలా మందికి కలిసి వస్తోంది. అయితే మీ నియోజకవర్గాల్లో పోటీ పెట్టని గుర్తింపు లేని రాజకీయ పార్టీకి 5 లక్షలు ఆపై విరాళం ఇచ్చి.. సెక్షన్ 80ఉఉఅ కింద ట్యాక్స్ బెనిఫిట్ క్లెయిమ్ చేసుకుంటే? ఈజీగా ఐటీ శాఖకు దొరికిపోవడం ఖాయమే. సో బీ అలర్ట్. కొన్ని గుర్తింపు లేని రాజకీయ పార్టీల వల్ల మిగతా వాటికి కూడా చెడ్డపేరు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

# మిస్ వరల్డ్ పోటీలు.. హైదరాబాద్‌కు 140 దేశాల అందాల భామలు.. మొత్తం ఖర్చు రూ.54 కోట్లు

- మొదటి పేజీ తరువాయి

ఈ బిగ్?ఈవెంట్‌ను కవర్ చేసేందుకు మరో 3వేల మందికి పైగా దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు హాజరుకానున్నారు. మే 6 నుంచే కంటెస్టెంట్స్ రాకతో హైదరాబాద్ సందడిగా మారనుంది. 10న గచ్చిబౌలిలో మిస్ వర్డల్ ఓపెనింగ్ సెర్మనీ, 31న మిస్ వరల్డ్ గ్రాండ్‌ఫినాలె జరగనుంది. మధ్యలో తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేలా వివిధ ప్రాంతాల్లో రకరకాల ఈవెంట్లు నిర్వహించనున్నారు. మే 10న తెలంగాణ జానపద, గిరిజన నృత్యాలతో గ్రాండ్‌గా ఓపెనింగ్ సెర్మనీ.. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే కంటెస్టెంట్లకు తెలంగాణ ఆటపాటలతో గ్రాండ్ వెల్?కమ్. మే 12, 13న కంటెస్టెంట్ల స్పిరిచ్యువల్ టూర్, నాగార్జున సాగర్ బుద్ధవనం సందర్శనతో పాటు హైదరాబాద్ హెరిటేజ్ వాక్. మే 13న చౌమహల్లా ప్యాలెస్ విజిట్, మే 14న కాకతీయ హెరిటేజ్ ట్రిప్ వరంగల్, రామప్ప ఆలయ సందర్శన. మే 15న యాదగిరిగుట్ట ఆలయ దర్శనం.. అదేరోజు పోచంపల్లి హ్యాండ్ లూమ్ టూర్. మే 16న ఏఐజీ, అపోలో, యశోద హాస్పిటల్స్‌కు కంటెస్టెంట్ల మెడికల్ టూర్. మే 17న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ స్పోర్ట్స్ ఫినాలే. మే 17న తెలంగాణ ఎక్స్ పీరియం ఎకో టూరిజం పార్క్ సందర్శన, తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్, కల్చరల్ ఈవెంట్. మే 19న కంటెస్టెంట్ల స్టేట్ సెక్రటేరియట్ టూర్, ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ విజిట్. మే 20, 21న టీ హబ్ ఆధ్వర్యంలో కాంటినెంటల్ ఫినాలే. మే 21న శిల్పారామంలో కంటెస్టెంట్ల ఆర్ట్స్, క్రాఫ్ట్స్ సెషన్. తెలంగాణ వైపు ప్రపంచం దృష్టిని ఆకర్షించడం, హైదరాబాద్ ?బ్రాండ్ ఇమేజ్ పెంచడం, ఇక్కడి పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోటీలకు ఆతిథ్యం ఇస్తున్నది. మిస్?వరల్డ్?పోటీలకు మొత్తం రూ.54 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో సగం అంటే రూ.27 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. మిగతా సగం ఈవెంట్ నిర్వాహకులు వెచ్చిస్తారు. ప్రభుత్వం ఇచ్చే రూ.27 కోట్లలో కేవలం రూ.5 కోట్లను మాత్రమే నేరుగా భరిస్తుంది. మిగిలిన రూ.22 కోట్లను స్పాన్సర్ల ద్వారా సమకూర్చుకునేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తుండటం గమనార్హం.

# కాంగ్రెస్ సర్కారుకు జగదీశ్ రెడ్డి మాస్ వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలను మందబలంతో నడుపుతామంటే కుదరదని ఆయన హెచ్చరించారు. తనను సభ నుంచి సస్పెండ్ చేశామని చెబుతున్న స్పీకర్.. దీనికి సంబంధించి బులెటిన్ ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. బులెటిన్ ఇవ్వకుండా సస్పెండ్ చేశాం సభకు రావద్దని అనడం ఏంటని నిలదీశారు. ఏ కారణంతో తనను సస్పెండ్ చేశారో వివరిస్తూ బులెటిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.‘ఓ పద్ధతీ పాడూ లేకుండా సభను నడిపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజ్యాంగ విలువలు, నిబంధనలు పాటించకుండా జరిపిస్తున్నారు. నన్ను సస్పెండ్ చేశామంటున్నారు కానీ కారణం చెప్పడంలేదు, బులెటిన్ ఇవ్వలేదు. మరి నన్నెలా అడ్డుకుంటారు? సస్పెన్షన్ కు సరైన కారణంలేదు కాబట్టి బులెటిన్ ఇవ్వలేదు. ఇస్తే నేను ఎక్కడ కోర్టుకు వెళతానోనని భయపడుతున్నారు’ అంటూ జగదీశ్ రెడ్డి ఆరోపించారు. అదేసమయంలో నల్గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు, మంత్రులపై జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కారులో కేవలం గంట ప్రయాణానికి కూడా మంత్రులు హెలికాప్టర్ ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. జాన్ పహడ్ లో ఆదివారం జరిగిన ఓ దావత్ కు జానారెడ్డి హెలికాప్టర్ లో వచ్చారని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు.

# బీఆర్ఎస్ పని అయిపోయింది

- మొదటి పేజీ తరువాయి

దక్కించుకోవడం ఇక కలేనని మంత్రి ఎద్దేవా చేశారు. ఒకవేళ తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఛాలెంజ్ చేశారు.ఈ సవాలుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమేనా అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు విదేశాల నుంచి వస్తే కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లక తప్పదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేశామని.. మిగిలినవి కూడా అతి త్వరలో అమలు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

# హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు తాజాగా షెడ్యూల్ విడుదలైంది. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం మే 1వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం మార్చి 28న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్ 4 నామినేషన్లు దాఖలుకు ఆఖరి గడువు. 7న దాఖలైన నామినేషన్లను

పరిశీలించను న్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. ఏప్రిల్ 23న పోలింగ్, 25న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి.

# జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కనిపించడం లేదంటూ బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు!

- మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని సమస్యలపై ఆమె శ్రద్ధ చూపడం లేదని శ్రవణ్ ఆరోపించారు. కనీసం ఆమె కార్యాలయంలో కూడా అందుబాటులో ఉండటం లేదని ఆయన అన్నారు. నగరంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ, మేయర్ వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం కోసం ఆమె స్వయంగా పర్యటించడం లేదని పేర్కొన్నారు. కనీసం కార్యాలయంలో కూడా ఆమె అందుబాటులో ఉండకపోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని అన్నారు. పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, చెత్త సమస్య, రోడ్ల దుస్థితి వంటి అంశాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మేయర్ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# తమిళనాడులోకి జనసేన ఎంట్రీ..

జనసేన పార్టీ విస్తరణపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజల కోరిక మేరకు జరగాలని ఉంటే... తమిళనాడులో జనసేన కచ్చితంగా అడుగు పెడుతుందని ఆయన అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మంచి వ్యక్తి అని... ప్రత్యర్థులపై పగ తీర్చుకోవాలనే ఉద్దేశం లేని ఆయన ఉదార వైఖరిని అభినందించాల్సిందేనని చెప్పారు. పార్టీ పెట్టడం ముఖ్యం కాదని... దాన్ని నిలబెట్టుకోవడమే ప్రధానమని అన్నారు. రాజకీయాల్లో ఎంతో ఓపిక అవసరమని చెప్పారు. సినీ నటులు రాజకీయాల్లో గెలవడం అంత ఈజీ కాదని అన్నారు. ఆ ఘనత కేవలం ఎన్టీఆర్ కు మాత్రమే సాధ్యమయిందని చెప్పారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అద్భుతమని కితాబునిచ్చారు. తమిళనాడులో అన్నాదురై, ఎంజీఆర్ ను తాను ఆదర్శంగా తీసుకుంటానని తెలిపారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ లకు వచ్చిన అవకాశం మరెవరికీ రాలేదని చెప్పారు. మనం ఎంత పాప్యులర్, మన వద్ద ఎంత డబ్బు ఉందనేది ముఖ్యం కాదని... మన ఐడియాలజీ ప్రజల్లోకిద

ఎంతవరకు వెళ్లిందనేదే ముఖ్యమని అన్నారు.రాజకీయరంగం అత్యంత కఠినమైనదని... ఇక్కడ అందరూ శత్రువులేనని పవన్ చెప్పారు. రాజకీయాల వల్ల వ్యక్తిగత జీవితం ప్రభావితమవుతుందని తెలిపారు. తమిళనాడులో విజయ్, పళనిస్వామి కెమిస్ట్రీ వర్కౌట్ అవుతుందో? లేదో? తాను చెప్పలేనని అన్నారు. ఇరువైపులా ఓట్ల షేరింగ్ జరుగుతుందా? అనేది కూడా అనుమానమేనని చెప్పారు. ఏపీలో టీడీపీ, జనసేన మధ్య కెమిస్ట్రీ వర్కౌట్ అయిందని అన్నారు. తమిళనాడులో టీవీకే, ఏఐఏడీఎంకే పార్టీ కార్యకర్తల మధ్య సమన్వయం కుదురుతుందో? లేదో? చెప్పలేమని అన్నారు.

# తప్పు చేయకుంటే ఉలికిపాటు ఎందుకు?

**పెన్ పవర్ డెస్క్:** పల్నాడు జిల్లాలో ఓ స్టోన్ క్రషర్స్ సంస్థ మేనేజ్ మెంట్ ను బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలపై మాజీ మంత్రి విడదల రజనిపై కేసు నమోదు కావడం తెలిసిందే. అయితే తనపై పెట్టింది అక్రమ కేసు అని, దీని వెనుక టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కుట్ర ఉందని విడదల రజని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై చిలకలూరిపేట టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్పందించారు. తప్పు చేయనప్పుడు ఉలికిపాటు ఎందుకని విడదల రజనిని పరోక్షంగా ప్రశ్నించారు. అవినీతికి పాల్పడలేదనప్పుడు రాయబారాలు ఎందుకు చేస్తున్నారంటూ నిలదీశారు. తప్పు చేసిన వాళ్లు ఎవరైనా సరే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారు అని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. నిజాయతీపరుడైన ఎంపీ మీద అవాకులు చెవాకులు పేలితే సరిపోతుందా? గతంలో అవినీతి మంత్రిగా ముద్ర వేయించుకున్న వ్యక్తి నేడు నీతులు చెబుతుండడం ఆశ్చర్యంగా ఉంది అని వ్యాఖ్యానించారు. నాడు అధికార గర్వంతో అరాచకాలు చేసి, ఇప్పుడు సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తోంది అంటూ విమర్శించారు.

# బాధ్యత గల పౌరురాలిగా ఇక అలాంటి పనులు చేయను

- మొదటి పేజీ తరువాయి

బెట్టింగ్ లకు పాల్పడటం, బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేయడం తప్పేనని శ్యామల చెప్పారు. తాను చట్టాన్ని గౌరవిస్తానని... విచారణకు పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున... మాట్లాడటం సరికాదని చెప్పారు.

# ఎస్ఎల్బీసీ సహాయక చర్యలు... రేవంత్ కీలక ఆదేశాలు

**పెన్ పవర్ డెస్క్:** ఎస్ఎల్బీసీ టన్నెల్ లో సహాయక చర్యలు చేపట్టి నెల రోజులు దాటినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. ఇప్పటి వరకు ఒక మృతదేహాన్ని మాత్రమే వెలికి తీశారు. ఈ క్రమంలో ఎస్ఎల్బీసీ సహాయక చర్యలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యల నిరంతర పర్యవేక్షణ కోసం సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. సహాయక చర్యలు నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సహాయక చర్యలు త్వరగా జరిగేలా చూడాలని చెప్పారు. సహాయక చర్యలకు కేంద్రం నుంచి అవసరమైన అనుమతులను త్వరగా తీసుకోవాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా సహాయక చర్యలను నిపుణుల సలహాలతో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు.

# తెలంగాణ నుంచి అప్పటి వరకు రిలీవ్ చేయవద్దు

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలంటూ కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులపై ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. క్యాట్‌లో విచారణ తేలే వరకు తెలంగాణ నుంచి ఆయనను రిలీవ్ చేయవద్దని కోర్టు ఆదేశించింది. తెలంగాణలో ఐపీఎస్‌గా విధులు నిర్వహిస్తోన్న అభిషేక్ మహంతిని ఏపీలో రిపోర్టు చేయాలని గత నెలలో డీవోపీటీ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అభిషేక్ మహంతి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ని ఆశ్రయించారు. డీవోపీటీ, తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ క్యాట్ విచారణను వాయిదా వేసింది.డీవోపీటీ ఉత్తర్వుల మేరకు మహంతి మార్చి 20వ తేదీలోపు ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం పైవిధంగా ఆదేశాలు జారీ చేసింది. మహంతి పిటిషన్‌ను త్వరగా విచారించాలని క్యాట్‌ను హైకోర్టు ఆదేశించింది.

## మన దేశంలో ఎంపీల జీతాలు పెరిగినయ్..

- మొదటి పేజీ తరువాయి

జరుగుతున్న సమయంలోనే ఎంపీల జీతాలు, అలవెన్సులు, పింఛన్ల పెంపు ప్రకటన వెలువడటం గమనార్హం. ఇంతకు ముందు 2018 ఏప్రిల్‌లో సిట్టింగ్, మాజీ ఎంపీలకు చెల్లించే జీతం మరియు అలవెన్సులను సవరించారు. ఆ సమయంలో ద్రవ్యోల్బణం, జీవన వ్యయం పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ఎంపీల మూల వేతనాన్ని నెలకు రూ. 1,00,000గా నిర్ణయించారు. 2018 సవరణ ప్రకారం, వేతనాలకు అదనంగా.... ఎంపీలు తమ కార్యాలయ నిర్వహణ, ఓటర్లతో సంబంధాలు కొనసాగించడానికి నియోజకవర్గ భత్యంగా రూ. 70,000 పొందుతున్నారు. దీనితోపాటు, నెలకు కార్యాలయ భత్యంగా రూ. 60,000, పార్లమెంటరీ సమావేశాల సమయంలో రోజువారీ భత్యంగా రూ. 2,000 అందుకుంటున్నారు. ఈ అలవెన్సులు కూడా ఇప్పుడు పెరగనున్నాయి.వీటితో పాటు, ఎంపీలకు ఫోన్ మరియు ఇంటర్నెట్ వినియోగం కోసం వార్షిక భత్యం కూడా లభిస్తుంది. వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి సంవత్సరానికి 34 ఉచిత దేశీయ విమాన ప్రయాణాలు, వృత్తిపరమైన మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం ఎప్పుడైనా ఫస్ట్ క్లాస్ రైలు ప్రయాణం చేయవచ్చు. రోడ్డు మార్గం గుండా వెళితే మైలేజ్ అలవెన్స్ కూడా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఎంపీలు సంవత్సరానికి 50,000 యూనిట్ల ఉచిత విద్యుత్ మరియు 4,000 కిలో లీటర్ల నీటిని కూడా పొందుతారు.ప్రభుత్వం వారి గృహ వసతిని కూడా భరిస్తుంది. వారి ఐదేళ్ల పదవీకాలంలో, ఎంపీలకు ఢిల్లీలో అద్దె లేని వసతి కల్పిస్తారు. వారి సీనియారిటీ ఆధారంగా హాస్టల్ గదులు, అపార్ట్‌మెంట్లు లేదా బంగ్లాలు పొందవచ్చు. అధికారిక వసతిని ఉపయోగించకూడదనుకునే వ్యక్తులు నెలవారీ గృహ అద్దె భత్యం పొందడానికి అర్హులు.

## రైతు ఆర్ధిక పరిపుష్టి సాధించాలనే నాడు ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేశాం

**నర్సంపేట పెన్ పవర్:** నర్సంపేట నియోజకవర్గంలో అత్యదిక ఎఫ్ పి ఓ లు ఏర్పాటు చేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన రైతులకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపాడు.మా పాలనలో ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేస్తున్నప్పుడు చాలా మంది వ్యంగంగా మాట్లాడారని, రైతులు ఐక్యత చాటి సంఘాలను నిలబెట్టి,రాష్ట్రంలోనే అత్యదికంగా ఎఫ్ పి ఓ లను సాధించుకున్న ఘనత నర్సంపేట నియోజకవర్గానికి దక్కిందని పెద్ది ఆనందం వ్యక్తం చేశాడు.కేంద్రం ప్రత్యేక ఎఫ్ పి ఓ మేళ నిర్వహించాలనే అవకాశం ఇచ్చినప్పుడు 30 శాతం ఎఫ్ పి ఓ ప్రస్థుత వరంగల్ జిల్లాలోనే ఉండటం విశేషమన్నాడు. నర్సంపేట నియోజకవర్గంలో 90 ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నాడు.ఈ మద్య ప్రభుత్వం వాటిని నిర్వీర్య పరచడం వల్ల ,ప్రభుత్వం సహకారం లేకపోవటంతో కొన్ని సంఘాలు స్థిరత్వం పొందలేకపోయాయని,ఐనప్పటికి వరంగల్ జిల్లాలో 57 ఎఫ్ పి ఓ లలో 18500 మంది రైతులు ఐక్యత కలిగి క్రియాశిలకంగా పనిచేస్తున్నారన్నాడు. రైతులు ఆర్థిక పరిపుష్టి కలగాలంటే తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి వ్యవసాయ యంత్రికరణ వల్ల వచ్చిందన్నాడు.సన్న ,చిన్నకారు రైతులే తెలంగాణ ప్రాంతంలో ఎక్కువ ఉన్నారని,దానివల్ల 20 గుంటల నుండి 2 ఎకరాల లోపు రైతులే ఎక్కువ,వీటి కోసం యంత్రాలు తీసుకురావటానికి ఖర్చు పెరుగుతుందన్నాడు.ఇందుకు సంబందించి ఖర్చును తగ్గించటం కోసమే ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయడం,సకాలంలో దిగుబడిని సాదించడం ప్రదాన ఉద్దేశ్యమని,అంతే కాకుండా శిక్షణ,శాస్త్రవెత్తల ద్వారా సూచనలు తీసుకోవటం,మెలకువలు నేర్చుకోవడం,పంటలకు వచ్చే తెగుల్లపై శాస్త్ర వెత్తల సహకారం తీసుకోవడానికి వెసలుబాటు ఉంటుందన్నాడు.ఎలాంటి గ్యారెంటీ లేకుండా నా బార్డ్ లాంటి బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవటానికి అవకాశం ఉంటుందని తెలిపాడు.పండించిన పంటను మార్కెటింగ్ చేసుకోవటం కోసం కూడా ఎఫ్ పి ఓ లు తోడ్పాటునందిస్తాయని,తక్కువ దరకు పంటను అమ్ముకోకుండా,పంట ఉత్పత్తిని రెండు రెట్ల ఆదాయం పొందేందుకు నిల్వ సామర్థ్యాన్ని ఎఫ్ పి ఓ ల ద్వారా ఏర్పాటు చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని వివరించాడు.రైతులు మరింత సంఘటితమై ఎఫ్ పి ఓ లు వాల్యూ ఆడెడ్ సర్వీసుల కోసం రుణాలు పొంది,రైతులే వ్యవసాయ అవసరాకు సంబందించిన వాటిచి ఉత్పత్తి చేసే అగ్రీ ఇండస్ట్రీలు నెలకొల్పుకోవటం ద్వారా ఉత్పత్తి చేసిన వాటిని ఎగుమతులు చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాదించేశ్రీఅవకాశం ఉంటుందన్నాడు.ఈ దేశంలో ఎఫ్ పి ఓ లు ఎలాంటి షరతులు లేకుండా తమ ఉత్పత్తులను అమ్ముకునేలా,ట్రాన్స్ ఫోర్ట్ చేసుకునే చట్టాలు ఉన్నాయని,ఎలాంటి టాక్స్ కట్టాల్సిన అవసరం లేకుండా దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వెసలుబాటు కలుగుతుందన్నాడు.విత్తనాల తయారి,సేంద్రీయ ఎరువుల తయారితో పాటు ఇతర ఉత్పత్తులు చేసే విదంగా నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అవకాశం కల్పించామన్నాడు.పర్టిలైజర్స్,ఫెస్టిసైడ్,విత్తనాల తయారి,దాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ఎఫ్ పి ఓ లకు ఇవ్వటం జరిగిందని,వాళ్ళ పండించిన పంటను వాళ్ళె కొనుగోలు చేసే అంశం కీలకమైనదని, రైతు బలంగా ఉంటేనే ఈ దేశం,రాష్ట్రం బలంగా ఉంటుందని.ఎఫ్ పి ఓ లు ఏర్పాటు చేసినపుడు రాబోయే తరాలకు ఉపయోగపడాలనే ముందుచూపుతో మిర్చి ఎక్కవ పండించే రైతులవి ఎక్కువ ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయటం జరిగిందన్నాడు.మొక్కజొన్న,దాన్యం,కూరగాయలు,పండ్లు పండించే రైతులకు టజూనీ లను ఏర్పాటు చేయటం జరిగిందని,కేసీఆర్ హయాంలో నర్సంపేటలో ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓ లో దేశానికే ఆదర్శంగా నిలిచాయని,మహారాష్ట్ర,కర్నాటక,చత్తిస్ ఘడ్ లాంటి రాష్ట్రాల రైతు సంఘాల నాయకులు,వ్యవసాయ శాస్త్రవెత్తలు ఎఫ్ పి ఓ ల విషయంలో నర్సంపేటను సందర్శించాలని అనుకుంటున్నారని, ఎన్నికల నేపద్యంలో సాద్యపడలేదని.దేశ దృష్టిని ఆకర్శించే విదంగా నర్సంపేట ఎఫ్ పి ఓ లు నిలిచాయని,అందరూ ఈ ఎఫ్ పి ఓ లను అద్యయనం చేయాలని సూచించాడు.

## మూలపేట వేణుగోపాల స్వామి గుడి అభివృద్ది కి కృషి

**నెల్లూరుదు: పెన్ పవర్:**నెల్లూరు మూలపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థాన పాలకమండలి సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరయ్యారు. వేద మంత్రోచ్ఛరణలు, మంగళకర మేళతాళాలతో మంత్రి కి ఆలయ మర్యాదలతో అర్చకస్వాములు, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేణుగోపాల స్వామివారిని దర్శించుకుని మంత్రి పూజల్లో పాల్నారు. మంత్రి మాట్లాడుతూ పీఠాధిపతుల ఆశీస్సులు, సలహాలు,ఆలయ పాలకమండలి సభ్యులు, స్థానిక శాసనసభ్యులు, మంత్రి నారాయణ సూచనల మేరకు వేణుగోపాలస్వామి ఆలయ పూర్వ ప్రతిష్ట, పునర్నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు.

## సస్పెన్షన్ కాపీ రాలేదు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

**హైదరాబాద్: పెన్ పవర్:**నన్ను సస్పెండ్ చేసినట్లుగా ఇంతవరకు కాపీ ఇవ్వలేదు. అధికారికంగా ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం అయన మీడియాతో మాట్లడారు. అసెంబ్లి లోపలికి రావొద్దని ఆదేశాలు ఇచ్చారా? లేక అసెంబ్లీ ఆవరణ లోకి రావద్దని ఆదేశాలు ఇచ్చారా? లాభిలోకి కూడా రావొద్దని ఇచ్చారా? అనేది నాకు ఎలా తెలుస్తుందని అయన ప్రశ్నించారు. అందుకే నాకు అధికారిగా ఆర్డర్ కావాలని అడుగుతున్నానని అన్నారు.

## అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ నిరసన

**హైదరాబాద్:పెన్ పవర్:**రెండు లక్షల రూపాయల రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, భారత రాష్ట్ర సమితి శాసనసభ సభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు నల్లబ్యాడ్జీలతో అసెంబ్లీ సమావేశాలకు హాజరై నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేయకుండా మాట తప్పిందని సభలో నినాదాలు చేశారు."రుణమాఫీ బూటకం, కాంగ్రెస్ నాటకం!" "రెండు లక్షల రుణమాఫీ అరకొర, కాంగ్రెస్ కొరకొర!" "రెండు లక్షల రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ డౌన్ డౌన్!" అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్దపెట్టున నినదించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు న్యాయం చేయాలని, రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**హైదరాబాద్:పెన్ పవర్:** అకాల వర్షంతో రైతుల తీవ్రంగా నష్టపోయారు. రైతులు నష్టపోయిన పంటలను మీడియాకు చూసేందుకు వస్తుండగా మార్షల్స్ అడ్డుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మొక్క కంకులు, మామిడి పిందెలు తీసుకొస్తే అవి ఏమైనా బాంబులా వాటిని కూడా అడ్డుకున్నారు. ప్రధానమంత్రి తీసుకువచ్చిన ఫసల్ బీమాని ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. అకాల వర్షంతో నష్టపోయిన రైతుల పంటలపై వెంటనే సర్వే నిర్వహించాలి. ఎకరానికి 30 వేలు పరిహారం ఇవ్వాలనీ డిమాండ్ చేస్తున్నామని అయన అన్నారు.

## సీఎం రేవంత్ ను కలిసిన గజ్వేల్ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్: పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసారు. అసెంబ్లీకి హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శాసనసభా సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కాంగ్రెస్ నేత నర్సారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సిద్ధిపేట నుంచి పాదయాత్రగా కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్ చేరుకున్నారు. రాజ్ భవన్ వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం అందించారు.

# దేవాదుల... ఇలా అయితే ఎలా...

**హైదరాబాద్:పెన్ పవర్:**దేవాదుల ప్రాజెక్ట్ పనులు ప్రభుత్వానికి సవాల్ గా మారాయి. దేవన్నపేట పంప్ హౌజ్ లోని మోటార్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వీటిని ఆన్ చేసేందుకు టెక్నికల్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు జనగామ జిల్లాలో చాలావరకు పంటలు ఎండిపోతుండటంతో రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది.దేవాదుల ప్రాజెక్టు థర్డ్ ఫేజ్ లో భాగంగా హనుమకొండ జిల్లా దేవన్నపేట వద్ద నిర్మించిన పంప్ హౌజ్ ఓపెనింగ్ పనులు రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ గా మారాయి. ఓ వైపు కరువు పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలు ఎండిపోతుండగా.. దేవన్నపేట పంప్ హౌజ్ లోని మూడు మోటార్లలో ఒకదానిని ప్రారంభించి, అత్యవసరంగా సాగునీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇతర నేతలు ఒక మోటార్ ను ప్రారంభించేందుకు అక్కడికి వెళ్లారు. కానీ మోటార్లు, పంపింగ్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా మోటార్ ను ఆన్ చేయలేకపోయారు. దీంతోనే సాంకేతిక లోపాన్ని సవరించేందుకు ఆస్ట్రియా దేశం నుంచి ప్రత్యేక టీమ్ ను సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ రప్పించింది. దాదాపు ఐదు రోజులుగా టెక్నికల్ టీమ్ తలపడుతున్నా.. ఇంతవరకు మోటార్ ఆన్ కాకపోవడంతో ప్రభుత్వ పెద్దలు కూడా తలలు పట్టుకోవాల్సి వస్తోంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2004లో రూ.6016 కోట్ల అంచనా వ్యయంతో జువ్వాడి చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులు ప్రారంభించింది. కానీ ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్సార్ పీరియడ్ లో దేవాదుల ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. ఈ మేరకు వైఎస్సార్ హయాంలోనే దేవాదుల ప్రాజెక్ట్ ఫస్ట్, సెకండ్ ఫేజ్ పనులు పూర్తయ్యాయి. కాగా ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో 6.21 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు చేపట్టిన థర్డ్ ఫేజ్ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.తెలంగాణ ఏర్పడిన తరువాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు పదేళ్ల కాలం పాటు దేవాదుల థర్డ్ ఫేజ్ పనులు నత్తనడకన సాగగా.. ఇప్పుడిప్పుడే చివరి దశకు చేరుతున్నాయి. కాగా థర్డ్ ఫేజ్ కింద ములుగు జిల్లా రామప్ప చెరువు నుంచి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ వరకు రూ.1410 కోట్లతో టన్నెల నిర్మాణం చేపట్టారు. మొదట 54.88 కిలోమీటర్ల మేర దీనిని తవ్వాలని నిర్ణయించగా.. ఈ మేరకు హెచ్సీ, మెయిల్ కంపెనీలు జాయింట్ వెంచర్ లో పనులు దక్కించుకున్నాయి. అనంతరం సబ్ లీజ్ పై కోస్టల్ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు పనుల బాధ్యతను అప్పగించారు.వాస్తవానికి ఈ టన్నెల్ పనులు కూడా 2011 డిసెంబర్ నాటికే పూర్తి కావాల్సి ఉంది. కానీ హనుమకొండ జిల్లా శాయంపేట మండలం చలివాగు ప్రాజెక్టు వద్ద టన్నెల్ కు బుంగపడి లోపలికి నీళ్లు చేరడంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం, బీఆర్ఎస్ సర్కార్ పనులను కోస్టల్ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ నుంచి మేఘా సంస్థకు అప్పగించడంతో అప్పటి నుంచి పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి.దేవాదుల ఎత్తిపోతల ఎత్తిపోతల పథకం థర్డ్ ఫేజ్ లో భాగంగా హసన్ పర్తి మండలం దేవన్నపేట వద్ద పంప్ హౌజ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఏళ్ల తరబడి ఆగుతూ సాగుతూ వచ్చిన పనులు ఎట్టకేలకు చివరి దశకు ఉన్నాయి. ఈ పంప్ హౌజ్ వద్ద రెండు షాఫ్ట్ లు నిర్మించారు. అందులో ఒక దాంట్లో వాటర్ స్టోరేజీ చేసి, రెండో దాని నుంచి మూడు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు పంప్ హౌజ్, సర్జ్ పూల్ వర్క్స్ కంప్లీట్ అయ్యాయి.భూగర్భ జలాలు ఎండుతుండటం, వేసవి ప్రభావం వల్ల జనగామ జిల్లాలో చాలావరకు పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్ట్ థర్డ్ ఫేజ్ లోని దేవన్నపేట పంప్ హౌజ్ వద్ద పనులు పూర్తయిన ఒక మోటార్ నైనా ప్రారంభించాలని నిర్ణయించుకుంది రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక హెలిక్యాప్టర్ లో వచ్చి, స్థానిక స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇతర నేతలతో కలిసి పంప్ హౌజ్ లో మోటార్ ను ప్రారంభించేందుకు ప్రయత్నం చేశారు. కానీ సాంకేతిక లోపం కారణంగా మోటార్ ఆన్ కాలేదు. దీంతో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సుమారులో దేవన్నపేట పంప్ హౌజ్ వద్దకు చేరుకున్న మంత్రులు.. అక్కడే చాలాసేపు చూశారు. ఎంతకూ మోటార్లు ఆన్ కాకపోవడంతో ఎలాగైనా మోటార్లు ఆన్ చేశాకే వరంగల్ నుంచి వెళ్తామంటూ మంత్రులు హనుమకొండలోని నిట్ గెస్ట్ హౌజ్ కు చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు వేచి చూసి, మరోసారి పంప్ హౌజ్ ను విజిట్ చేశారు. కానీ ఫలితం లేకపోవడంతో అర్ధరాత్రి అక్కడి నుంచి వెనుదిరిగి హైదరాబాద్ కు ప్రయాణమయ్యారు.దేవాదుల పంప్ హౌజ్ ను స్కాడా సిస్టంలో ఏర్పాటు చేస్తున్నారు. మోటార్లు, పంపింగ్ వ్యవస్థకు లింకప్ గా ఉండే ఈ స్కాడా సిస్టం ఎప్పటికప్పుడు నీటి ప్రవాహం, మోటార్ల పనితీరును అబ్జర్వ్ చేస్తుంది. అందులో ఏమైనా లోపాలు తలెత్తితే వెంటనే ఈ స్కాడా సిస్టం సంకేతాలు ఇస్తుంది. ఫలితంగా రూ.కోట్లు విలువ చేసే మోటార్లకు నష్టం వాటిల్లే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.కాగా ఈ స్కాడా సిస్టంలో సాంకేతిక లోపాలు తలెత్తడం వల్లే దేవాదుల మోటార్లు ఆన్ కావడం లేదు. దీంతో కాంట్రాక్ట్ సంస్థ మోటార్లను తెప్పించి, ఆస్ట్రియా దేశం నుంచి ప్రత్యేకంగా టెక్నికల్ టీమ్ ను కూడా రప్పించింది. దీంతో దాదాపు 14 మందితో కూడిన ఆ టెక్నికల్ టీమ్ సాంకేతిక లోపాన్ని సవరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే దాదాపు ఐదు రోజులుగా శ్రమిస్తుండగా.. ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు.ఓ వైపు పంటలు ఎండుతుండగా, దేవాదుల పంపులను ఆన్ కాకపోవడం వల్ల రాష్ట్ర సర్కారు చిక్కుల్లో పడినట్లయ్యింది. ఈ మేరకు దేవన్నపేట పంప్ హౌజ్ పై స్పెషల్ ఫోకస్ పెట్టి, సమస్యను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు మంత్రులు కూడా వాకబు చేస్తున్నారు. ఈ మేరకు ఒకట్రెండు రోజుల్లో దేవాదుల నీటిని విడుదల చేస్తామని చెబుతున్నారు. మరి ఈసారైనా పంపులు ఆన్ అవుతాయో లేదా మొన్నటిలాగే మొరాయిస్తాయో చూడాలి.

# దేశ జీడీపీకి, డీలిమిటేషన్ కు ఏం సంబంధం?

- తెలంగాణ జీడీపీలో ఆదిలాబాద్, ములుగు, ఆసిఫాబాద్ వెనకబడి ఉంటే... వాటా అక్కర్లేదా?
- లిక్కర్ దొంగలంతా ఒకే చోట జమై మోదీపై దక్షిణాది పేరుతో డ్రామాలాడుతున్నరు
- 6 గ్యారంటీలపై ప్రజలను మోసం చేశారు
- ఇంకా 16 లక్షల మంది రైతులకు రుణమాఫీ కానేలేదు
- రుణమాఫీ పూర్తయ్యిందని ప్రకంటించం సిగ్గు చేటు
- బీఆర్ఎస్ దొంగ నోట్లను ముద్రించింది
- బీదర్ లో దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ను నడిపింది బీఆర్ఎస్ నాయకుడే
- టీచర్లరా....మీ భవిష్యత్ కోసం తపస్ లో చేరండి
- తపస్ పక్షాన ఉద్యమాలను ఉధ్రుతం చేయండి
- మీ ఉద్యోగాలు పోతే... బీజేపీ టిక్కెట్లిచ్చి గెలిపించుకుంటాం
- కరీంనగర్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్...
- సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్సీలను ఘనంగా సన్మానించిన తపస్

**హైదరాబాద్:పెన్ పవర్:**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, ఆప్, సీపీఎం పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లిక్కర్ దొంగలంతా ఒకే చోట సమావేశమై డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. "స్టాలిన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసింది. కేరళలోనూ లిక్కర్ స్కాం బయటపడింది. ఆప్, బీఆర్ఎస్ నేతలు ఆల్రెడీ లిక్కర్ స్కాం చేసి జైలుకు పోయింది. వీళ్లంతా కలిసి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతూ మోదీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారు"అని దుయ్యబట్టారు. వాళ్లంతా దేశ జీడీపీకి, పార్లమెంట్ లో ప్రాతినిధ్యానికి లింకు పెట్టడంపై మండిపడ్డారు. "నిన్న చెన్నైయ్ లో స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లిక్కర్ దొంగల ముఠా ఒకే చోట సమావేశమై విచిత్రమైన తీర్మానం చేశారు. దేశ జీడీపీలో దక్షిణాది వాటా 36 శాతం ఉన్నందున పార్లమెంట్ లో కూడా దక్షిణాదికి 36 శాతందాకా వాటా ఇవ్వాలని అడుగుతున్నరు. ఇదేం విచిత్రం? దేశ జీడీపీకి పార్లమెంట్ లో ప్రాతినిధ్యానికి సంబంధమేంది? అట్లనుకుంటే తెలంగాణ జీడీపీ(ఉతీనీబబ టనీఎవబబితిఇ జూతీనీటబీఇబి)లో వెనుకబడ్డ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు వంటి జిల్లాల ప్రాతినిధ్యం చాలా తక్కువ. అంత మాత్రాన అసెంబ్లీలో వాటికి ప్రాతినిధ్యం ఉండకూడదా? ఇదెక్కడికి దిక్కుమాలిన ప్రతిపాదన? దక్షిణాది పేరుతో రాజకీయాలు చేస్తూ డీలిమిటేషన్ ను అడ్డుకునే కుట్రలు చేయడమేంది?" అని ఫైర్ అయ్యారు. ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని శుభం గార్డెన్ లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ హాజరై ప్రసంగించారు. ఏమన్నారంటే... టీచర్ల దమ్మేందో, తపస్ అనే ఉపాధ్యాయ సంఘం తలుచుకుంటే ఏమైతదో మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులారా.... మీరంతా ఏ సంఘంవైపు చూడకండి. జాతీయవాద భావజాలం, టీచర్ల కోసం కొట్లాడే ఏకైక సంఘం తపస్. ఆ సంఘంలోనే చేరాలని కోరుతున్నా. మీకోసం కొట్లాడేది, దెబ్బలు తినేది, జైలుకు కూడా పోయేందుకు వెనుకాడని నాయకులు తపస్ మాత్రమే. అందుకే తపస్ బలపర్చిన అభ్యర్థి మల్క కొమరయ్యకు టిక్కెట్ ఇప్పించి సునాయాసంగా గెలిపించింది. తపస్ ను రాష్ట్రంలో నెంబర్ వన్ సంఘంగా మార్చి తీరుతాం.

తెలంగాణ సాధనలో టీచర్ల, ఉద్యోగుల పాత్ర మరువలేం. 42 రోజుల సకల జనుల సమ్మె చేసి తెగించి కొట్లాడి రాష్ట్రం సాధించుకున్నరు. కానీ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ అప్పుల పాలైంది. కేసీఆర్ కుటుంబ పాలనతో సర్వ నాశనమైంది. గతంలో కేసీఆర్ మనుషులు బీదర్ లో ఒక ప్రింటింగ్ ప్రెస్ లో దొంగ నోట్లు ముద్రించారు. ఆ ప్రింటింగ్ ప్రెస్ ను మూసివేసేందుకు మన రాష్ట్ర పోలీసులు వెళితే... ఒత్తిడి తెచ్చి అక్కడికి వెళ్లకుండా చేశారు.ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో పంచిన నోట్లన్నీ దొంగ నోట్లే.

బీఆర్ఎస్ పాలన పీడ విరగడ కావాలని ఆ పార్టీని ఓడించి కాంగ్రెస్ కు అధికారం అప్పగిస్తే ఏం ఒరిగింది? కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పుల్లో మునిగిపోయిందని చెప్పిన రేవంత్ రెడ్డి అయినప్పటికీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను తీర్చడంతోపాటు 6 గ్యారంటీలను కూడా అమలు చేసి తీరుతామని ప్రకటించారు. కానీ ఏమైంది? 15 నెలలుగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ దారుణంగా వంచిస్తూనే ఉన్నదు.

విద్యాశాఖకు అసలు మంత్రి కూడా లేదు. ఆయనే ఆ శాఖ మంత్రిగా ఉన్నా టీచర్లకు ఒరిగిందేమీ లేదు. కేంద్రం ప్రతి 6 నెలలకు ఒకసారి డీఏ ఇస్తోంది... నిత్యం మోదీపై విషం కక్కే కాంగ్రెస్ ప్రభుత్వం 5 డీఏలు ఎందుకు పెండింగ్ లో పెట్టారు? మరో 3 నెలలైతే జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. టీచర్ల, ఉద్యోగుల పెండింగ్ బిల్స్ మొత్తం రూ.8వేల కోట్లు. అట్లాగే రిటైర్డ్ మెంట్ బెన్ పిట్స్ బకాయిలు రూ.11 వేల కోట్లు. వీళ్లకు పైసలు ఇవ్వమంటే డబ్బుల్లేవని చెబుతున్న ప్రభుత్వం 18 శాతం కమీషన్ ఇస్తే మాత్రం కాంట్రాక్టర్లకు బిల్స్ క్లియర్ చేస్తోంది. ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలివ్వడం లేదు. కేజీబీవీ టీచర్ల బాధలు వర్ణణాతీం. ఈ సమస్యను పరిష్కరించాలని విద్యాశాఖ అధికారి యోగితారాణాకు నేనే ఫోన్ చేసిన. ఆ సమస్య పరిష్కారం కోసం క్రుషి చేస్తా.

టీచర్లను, తపస్ నాయకులను నేను కోరేదొక్కటే... సమస్యలపై పోరాడండి. తపస్ తల్చుకుంటే విద్యాశాఖను సమూలంగా ప్రక్షాళన కావాలి. టీచర్ల సమస్యలు పరిష్కారం కావాలే. ప్రభుత్వం ఉద్యోగం నుండి తీసేస్తదనే భయం మీకు వద్దు. మిమ్ముల్ని కాపాడుకునే బాధ్యత మాది. ఎందుకంటే విద్యా శాఖను అర్బన్ నక్సల్స్ చేతిలో పెట్టి తుపాకీ రాజ్యం తేవాలని కాంగ్రెస్ భావిస్తోంది. మోదీ ప్రభుత్వం విద్యార్థులకు కలం అందించి మహానుభావులుగా తీర్చిదిద్దాలని చూస్తుంటే... కాంగ్రెస్ అందుకు భిన్నంగా పాఠ్యపుస్తకాల్లో అర్బన్ నక్సల్స్ భావజాలాన్ని జొప్పించి తుపాకీ రాజ్యం కోసం కుట్రలు చేస్తుంటే సమాజానికి ఏ సందేశం పంపినట్లు? అసలు ఏ ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి అర్బన్ నక్సల్స్ ను విద్యా కమిషన్ లో నియమించారో సమాధానం చెప్పాలి. ఈ విధానాన్ని తపస్ కచ్చితంగా వ్యతిరేకించి ఉద్యమం ప్రారంభించాలి.

ఎంతకాలం బతికామన్నది కాదు.. బతికి ఉన్నంత కాలం జీవితమంతా స్పూర్తిదాయకంగా ఉండేలా పోరాడాలి. హీరోలెక్క బతకాలే తప్ప జీరో కావొద్దు. 317 జీవోసహా టీచర్ల సమస్యలపై నిరంతరం పోరాడి జైలుకు పోయింది బీజేపీయే. ప్రజల కోసం కొట్లాడితే నాపై 109 కేసులు పెట్టారు. తపస్ నాయకులు కూడా టీచర్ల సమస్యలపై, ప్రజల కోసం పోరాడండి. ఉద్యోగం కోల్పోతే వాళ్లకే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుంటాం. ఎందుకంటే ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమనే తేలిపోయింది.

ఎందుకంటే కాంగ్రెస్ చేసిన మోసాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. నిన్న అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో రుణమాఫీని పూర్తిగా అమలు చేసినట్లు ప్రకటించారు. ఇది చూసి ఇంత మోసమా? అంటూ రైతులంతా కాంగ్రెస్ ను బండబూతులు తిడుతున్నరు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2 లక్షల రుణమాఫీ అర్హుల జాబితా 42 లక్షలు. వీరందరికీ రుణమాఫీ కావాలంటే 31 వేల కోట్ల రూపాయలు కావాలి. కానీ ఇప్పటి వరకు 25 లక్షల 35 వేల మందికి 20 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారు. మరి మిగిలిన 16 లక్షల 65 వేల మంది పరిస్థితి ఏంది? వీళ్లకు రుణమాఫీ కావాలంటే రూ.10 వేల కోట్లు కావాలి. కానీ వీళ్లకు నయాపైసా చెల్లించకుండా రుణమాఫీ పూర్తయిందని అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించడం సిగ్గు చేటు. లక్షల మంది రైతులను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర్లో పడ్డాయి.

నిన్న చెన్నైయ్ లో స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొంగల ముఠా విచిత్రమైన తీర్మానం చేశారు. వాళ్లంతా లిక్కర్ స్కాం దొంగలే. స్టాలిన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసింది. కేరళలోనూ లిక్కర్ స్కాం బయటపడింది. ఆప్, బీఆర్ఎస్ నేతలు ఆల్రెడీ లిక్కర్ స్కాం చేసి జైలుకు పోయింది. వీళ్లంతా కలిసి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నరు. దేశ జీడీపీలో దక్షిణాది వాటా 36 శాతం ఉన్నందున పార్లమెంట్ లో కూడా దక్షిణాదికి 36 శాతందాకా వాటా ఇవ్వాలని అడుగుతున్నరు. ఇదేం విచిత్రం. దేశ జీడీపీకి పార్లమెంట్ లో ప్రాతినిధ్యానికి సంబంధమేంది? అట్లనుకుంటే తెలంగాణ జీడీపీ(ఉతీనీబబ టనీఎవబబితిఇ జూతీనీటబీఇబి) వెనుకబడ్డ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు వంటి జిల్లాల జీడీపీ ప్రాతినిధ్యం చాలా తక్కువ. అంత మాత్రాన అసెంబ్లీలో వాటికి ప్రాతినిధ్యం ఉండకూడదా? ఇదెక్కడికి దిక్కుమాలిన ప్రతిపాదన? దక్షిణాది పేరుతో రాజకీయాలు చేస్తూ డీలిమిటేషన్ ను అడ్డుకునే కుట్రలు చేయడమేంది?

ఒకవైపు రాష్ట్రంలో జనం అల్లాడుతున్నరు. సాగు నీరందక రైతులు 10 లక్షలకుపైగా పంట నష్టపోయిన్రు. నిన్న, మొన్న కురిసిన అకాల వర్షాలతో మళ్లీ పంట దెబ్బతిన్నది. ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద రోగులు ట్రీట్ మెంట్ కు నోచుకోవడం లేదు. పెండింగ్ లో ఉన్న వేల కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు చదువుకు దూరమైతున్నరు. కాలేజీలు మూతపడుతున్నయి. పెండింగ్ బిల్స్ చెల్లించకపోవడంతో వేలాది మంది మాజీ సర్పంచులు అప్పులపాలై బజారునపడ్డరు. చాలీచాలని వేతనాలతో అంగన్ వాడీలు, ఆశావర్కర్లు రోడ్లపై ధర్నా చేస్తూ ఆర్తనాదాలు చేస్తున్నరు. ఉద్యోగాలు రాక లక్షల మంది నిరుద్యోగులు అరిగోస పడుతున్నరు. పీఆర్సీ అమలుకాక, 5 డీఏలు అందక, దాచుకున్న జీపీఎఫ్ పైసలందక లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు బాధపడుతున్నరు. రిటైర్డ్ మెంట్ బకాయిలు చెల్లించక, పెన్షనర్ల సమస్యను పరిష్కరించకపోవడంతో వృద్దాప్యంలో మాకెందుకీ గోస అంటూ పెన్షనర్లు కన్నీళ్లు కారుస్తున్నరు......

రాష్ట్రంలో ఇన్ని సమస్యలుంటే ఇవేమీ పట్టని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని చెన్నై పోయి డీలిమిటేషన్ పేరుతో రాజకీయాలు చేస్తారా? మోదీ ప్రభుత్వంపై విషం కక్కడం తప్ప ప్రజలుకు ఈరెండు పార్టీలు చేస్తున్నదేమిటి?. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

# మేడిగడ్డ పాపాలు

**కరీంనగర్, మార్చి 24, పెన్ పవర్:** మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి నిర్మాణ సంస్థ నిర్లక్ష్యమే కారణమని నివేదిక తేల్చింది. ఈ మేరకు 257 పేజీలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి విజిలెన్స్ సమర్పించినట్లు సమాచారం. ఈ నివేదికలో పేర్కొన్న అంశాలంటూ కొన్ని విషయాలు బయటకు వస్తున్నాయి.. బ్యారేజీ నిర్మాణంలో కీలకమైన సీకెంట్ పైల్స్ వేయడంలో తీవ్ర లోపం జరిగిందని పేర్కొంది.ప్రైమరీ పైల్స్ వేసిన ఒకట్రెండు రోజుల్లో ఆర్‌సీసీ సీకెంట్ పైల్స్ వేయాల్సి ఉండగా.. నెల నుంచి నెలన్నర తర్వాత వేశారు. సీకెంట్ పైల్స్ ఎలా వేయాలన్నదానిపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ–పీఈఎస్ తమ అంతర్గత డాక్యుమెంట్‌నే అమలు చేయలేదు.నీటిపారుదల శాఖకు చెందిన ఫీల్డ్ ఇంజినీర్లు, క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండిపోయారు. ఫీల్డ్ ఇంజినీర్లకు సీకెంట్ పైల్స్ గురించి అవగాహన లేదు. దీని మీద ఉన్నతస్థాయి ఇంజినీర్లు పర్యవేక్షణ చేయలేదు.సీడీవో ఆమోదించిన డ్రాయింగులను అమలు చేయలేదు. లోపభూయిష్ఠ నిర్మాణం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సీకెంట్ పైల్స్ నిర్మాణంలో లోపం వల్ల రాఫ్ట్ కింద పైపింగ్ ఏర్పడి గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగానే అంతిమంగా ఏడో బ్లాక్ కుంగింది.బ్యారేజీ కుంగడానికి నిర్మాణ సంస్థ చర్యలు కూడా కారణమని విజిలెన్స్ తమ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లడానికి కారణమైందని భావిస్తున్నారు. 2021 డ్యాం సేఫ్టీ చట్టం, పీడీపీపీ చట్టం–1984, పీసీ యాక్టు–1988, ఐపీసీలోని 120(బీ), 336, 409, 418, 423, 426 ప్రకారం సంస్థపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి సిఫార్సు చేసింది. మేడిగడ్డ ఏడో బ్లాకు స్థానంలో కొత్తది నిర్మించడానికి అయ్యే వ్యయాన్ని నిర్మాణ సంస్థ నుంచి వసూలు చేయాలని సూచించింది. క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు సిఫార్సు చేసిన 17 మంది ఇంజినీర్లపైనా ఈ చట్టాల ప్రకారమే చర్య తీసుకోవాలని సూచించింది.ప్రభుత్వ ప్రయోజనాలకు భిన్నంగా ఇంజనీర్లు చేశారు. పని పూర్తికాకుండానే పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇవ్వడం, బ్యారేజీకి మరమ్మతులు చేయకున్నా పట్టించుకోకపోవడం ప్రభుత్వాన్ని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టింది. ఇంజినీర్లు, కాంట్రాక్టు సంస్థ కలిసి ప్రభుత్వ ప్రయోజనాలకు భిన్నంగా కుట్ర చేసినట్లు స్పష్టమవుతోంది. పరిపాలనా అనుమతి ఇచ్చిన దానికన్నా డీవియేషన్ అదనంగా పెరిగితే 15 శాతం వరకు ప్రభుత్వానికి సమాచారమిచ్చి చీఫ్ ఇంజినీరే సవరించిన సాంకేతిక అనుమతి ఇవ్వొచ్చు. అయితే మొదటిసారి సవరించిన అంచనా ఆమోదం పొందకముందే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా చీఫ్ ఇంజినీర్ 15 శాతం డీవియేషన్‌కు ఆమోదం తెలిపారు. మొదట సవరించి ఇచ్చిన అంచనాలో ఉన్న కొన్ని పనులు చేయలేదు.అయితే అంచనాలో లేని పనులను చేసి బిల్లులు పొందారు. కొన్ని మంజూరు చేసిన క్వాంటిటీస్ కన్నా ఎక్కువ చేసి బిల్లులు తీసుకున్నారు. రూ.1,343.76 కోట్ల డీవియేషన్‌కు చీఫ్ ఇంజినీర్ ఆమోదం తెలిపారు. 2018 జూన్ 23న రూ.3,260 కోట్ల సవరించిన అంచనాకు ఆమోదం రాగా, అంతకుముందే 2018 జూన్ 14న రూ.1,343.76 కోట్ల డీవియేషన్‌ను చీఫ్ ఇంజినీర్ ఆమోదించారు. క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించి 1,88,257 క్యూబిక్ మీటర్ల టెస్ట్ రిజిస్టర్లు లేవు. ఇందులో భారీగా అవకతవకలు



జరిగాయి.కాఫర్‌డ్యాం నిర్మాణానికి అంచనా వ్యయం తొలుత రూ.12.95 కోట్లు ఉండగా, 2018 జూన్ 23న మొదట సవరించిన అంచనాలో రూ.11.64 కోట్లకు తగ్గింది. రెండోసారి సవరించిన అంచనాలో రూ.61.21 కోట్లకు చేరింది. కాఫర్‌డ్యాంకు సంబంధించిన వివరాలు ఎక్కడా నమోదు చేయలేదు. విజిలెన్స్ రికార్డులు సీజ్ చేసే సమయంలో ఎంబీ–23, పేజీ–11లో పొందుపరిచారు. తర్వాత రికార్డు చేసిన 46,851 క్యూబిక్ మీటర్ల పనిని రద్దు చేశారు.బ్యారేజీ ప్రారంభం జరిగిన తర్వాత కాఫర్‌డ్యాం వ్యయాన్ని భారీగా పెంచి సవరించిన రెండో అంచనాను ఆమోదించడం నిధులను దుర్వినియోగం చేయడం, కాంట్రాక్టర్‌కు అయాచిత ప్రయోజనం కలిగించడానికేనని స్పష్టం చేసింది. ఈ నివేదికలోని అంశాల ఆధారంగా, మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో జరిగిన లోపాలు, అక్రమాలకు కాంట్రాక్టు సంస్థ, ఇంజినీర్ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

**ఆఫీసర్లపై క్రిమినల్ కేసులు**

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనలో బాధ్యులను చేస్తూ.. 17 మంది ఇంజనీర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సజెస్ట్ చేసింది. సస్పెన్షన్ లాంటి చర్యలు సరిపోదని భావించింది. అడుగడుగునా ఆ ఇంజనీర్ల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ఉందని గుర్తించింది. అందుకే వారిపై ఏకంగా క్రిమినల్ చర్యలకే సిఫార్సు చేయడం మామూలు విషయం కాదు.ఆ 17 మంది కాకుండా.. మరో 30 మందిపై డిపార్ట్‌మెంటల్ యాక్షన్ తీసుకోవాలని సూచించింది. ఈ లిస్ట్‌లో కాళేశ్వరం మాజీ ఇఔఅ నల్లా వెంకటేశ్వర్లు లాంటి టాప్ అధికారితో పాటు.. గతంలో ాఇ స్థాయిలో పనిచేసిన రమణారెడ్డి, ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న తిరుపతిరావు తదితరులు ఉన్నారు. దోషులుగా తేలిన 30 మంది ఇంజనీర్లలో వేరు వేరు విభాగాలకు చెందిన ఆఇఇలు, ంఇఇలు ఉన్నారు.మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజీకి కారణమంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తప్పుబట్టిన ఆ 47 మంది ఇంజనీర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవాలా అనే దానిపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు చర్చిస్తున్నట్టు సమాచారం. కఠిన చర్యలకే మొగ్గు చూపాలా? వారి పదోన్నతులు ఆపేయాలా? ప్రభుత్వం సలహా తీసుకోవాలా? కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ రిపోర్ట్ కూడా వచ్చే వరకు ఆగాలా? ఇలా రకరకాల కోణాల్లో ఆలోచిస్తున్నారని తెలుస్తోంది.కేవలం ఇంజనీర్లపైనే కాదు.. మేడిగడ్డ బ్యారేజీని నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థపైనా యాక్షన్ తీసుకోవాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూచించింది. అయితే, మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటులో తమ తప్పేమీ లేదని ఒఉ కంపెనీ మొదటినుంచీ వాదిస్తోంది. ప్లేస్ అండ్ ప్లాన్ డిసైడ్ చేసింది అప్పటి కేసీఆర్ సర్కారేనని.. తాము కేవలం నిర్మాణం మాత్రమే చేశామని చెప్పుకొస్తోంది. బ్యారేజీ నాణ్యతలో ఎలాంటి లోపం లేదని.. డిజైన్ ప్రాబ్లమ్ వల్లే బ్యారేజీ కుంగి ఉంటుందనేది ఎల్ అండ్ టీ వాదన. అందుకే, నిర్మాణ సంస్థ చెప్పినదాని ప్రకారమైనా.. విచారణలో బయటకు వస్తున్న విషయాల మేరకైనా.. మేడిగడ్డ డ్యామేజీలో పాపం అంతా కేసీఆర్‌దేనని స్పష్టమవుతోంది. ఎంక్వైరీ కంప్లీట్ అయితేగానీ అసలు దోషులెవరో తేలదు. ఆనాటి సర్కారు ఆడిచ్చినట్టూ ఆడిన అధికారులకు సైతం చిక్కులు తప్పట్లేదు.

# ఆన్ లైన్ బెట్టింగ్ షురూ...

**హైదరాబాద్, మార్చి 24 పెన్ పవర్:** ఐపీఎల్ 2025 కొత్త లీగ్ సీజన్ మొదలైంది. మార్చి 22 నుంచి క్యాష్ రిచ్ లీగ్ దాదాపు 2 నెలలపాటు క్రికెట్ ప్రేమికులకు వినోదాన్ని పంచనుంది. దీంతో క్రికెట్ ప్రియులు ఆసక్తి మొత్తం అటు వైపు మళ్లుతోంది. తమ ఫేవరెట్ టీమ్స్ మ్యాచులు చూసేందుకు ఆడియెన్స్ రెడీ అవుతున్నారు. ఈసారి సన్‌రైజర్స్ ఫ్యాన్స్ తెగ ఎంజాయ్ చేయనున్నారు. దీనికి కారణం ఉప్పల్ స్టేడియంలో ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచులతో పాటు ఓ క్వాలిఫయర్, ఒక ఎలిమినేటర్ మ్యాచ్ కూడా జరగనుంది. హైదరాబాద్‌లో ఐపీఎల్ సీజన్ ప్రారంభం కావడంతో బ్లాక్ టికెట్ దందా జోరుగా సాగుతోంది. ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు ఒకే రోజు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. రేపు జరగబోయే సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌కు బ్లాక్ టికెట్ల అమ్మకాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. భరద్వాజ్ అనే వ్యక్తిని బ్లాక్ టికెట్లు అమ్ముతుండగా పోలీసులు అరెస్టు చేశారు. సంపత్, హరి అనే ఇద్దరు వ్యక్తులు ఐదు బ్లాక్ టికెట్లతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. నిందితుల నుంచి ఐదు టికెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంపత్, హరిలపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో నేడు జరగబోయే సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌కు టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్లాక్ టికెట్ల అమ్మకాలు కూడా పెరిగాయి. పోలీసులు బ్లాక్ టికెట్ల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇలాంటి కార్యకలాపాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా బ్లాక్ టికెట్ల అమ్మకాలను అరికట్టడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా బ్లాక్ టికెట్ల అమ్మకాలను అరికట్టడానికి పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.స్టేడియం పరిసరాల్లో.. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లపై పోలీసులు నిఘా ఉంచారు. బ్లాక్ టికెట్లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద టికెట్లు అమ్ముతుండగా.... భరద్వాజ్ అనే వ్యక్తిని ఎల్బీనగర్ ాూ పోలీసులు పట్టుకున్నారు. నాలుగు టికెట్లు స్వాధీనం చేసుకున్నారు.బ్లాక్ టికెట్లు కొనుగోలు చేయవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. బ్లాక్ టికెట్లు కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం.. దీనికి జరిమానా, జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ లకు సంబంధించిన టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో అందుబాటులో ఉంటాయి. జొమాటోకు చెందిన డిస్ట్రిక్ట్ యాప్ లేదా వెబ్‌సైట్ లో టికెట్లను కొనుగోలు చేయవచ్చు.ఒకవేళ టికెట్ల కోసం ఎస్‌ఆర్‌హెచ్ అధికారిక వెబ్‌సైట్లకు వెళ్లినా తిరిగి డిస్ట్రిక్ట్.ఇన్ వెళ్లినా సైట్‌కే లింక్ రీడైరెక్ట్ అవుతుంది. ఇప్పటికే ఈ సీజన్‌లోని తొలి రెండు మ్యాచులకు సంబంధించిన టికెట్లను మార్చి 7న అందుబాటులో ఉంచారు. అవి హాట్ కేకుల్లా అమ్ముడ అయిపోయాయి.

# నల్గొండలో బర్డ్ ఫ్లూ కలకలం

**నల్గొండ, మార్చి 24, పెన్ పవర్:**
తెలంగాణలో మరొకసారి బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని ఫామ్‌లోని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందని అధికారులు నిర్ధారించారు. యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలోని ఒక కోళ్ల ఫామ్‌లోనూ.. 500 కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి మృతి చెందాయి, దీంతో 52 వేల కోళ్లు, 17 వేల కోడి గుడ్లు, 85 టన్నుల దానాను భూమిలో పూడ్చిపెటినట్టు అధికారులు వెల్లడించారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టాల్లో కూరుకుపోతున్నామని.. కోళ్ల ఫారం యజమానులు, మాంసం వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.ఇటీవల సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. దీంతో అధికారులు అలర్ట్ అయి.. నివారణ చర్యలు చేపట్టారు. రైతులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బర్డ్ ఫ్లూ అనేది ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ వల్ల వచ్చే ఒక ఇన్ఫెక్షన్. ఇది ప్రధానంగా పక్షులను ప్రభావితం చేస్తుంది. కానీ కొన్నిసార్లు మనుషులకు కూడా సోకుతుంది. బర్డ్ ఫ్లూ లక్షణాలు సాధారణ ఫ్లూ లక్షణాలను పోలి ఉంటాయి, కానీ కొన్ని సందర్భాల్లో మరింత తీవ్రంగా ఉంటాయి.జ్వరం.. సాధారణంగా 100ళీఈ (38ళీఅ) కంటే ఎక్కువ ఉంటుంది. పొడి దగ్గు లేదా రక్తంతో కూడిన దగ్గు కూడా రావచ్చు. గొంతులో మంట, నొప్పిగా ఉంటుంది. కండరాల నొప్పులు, శరీరం మొత్తం నొప్పులు వస్తాయి. తీవ్రమైన తలనొప్పి వస్తుంది. ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. కడుపులో వికారం, వాంతులు అవుతాయి. విరేచనాలు అవుతాయి. కళ్లు ఎర్రబడతాయి. నీరు కారుతాయి. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో బర్డ్ ఫ్లూ న్యుమోనియా, శ్వాసకోశ వైఫల్యం, ఇతర ప్రాణాంతక సమస్యలకు దారితీయవచ్చు.ఫారమ్‌లలో కఠినమైన బయోసెక్యూరిటీ ప్రోటోకాల్‌లను అమలు చేయాలి. పౌల్ట్రీ కేంద్రాలను క్రిమిసంహారక చేయడం, చనిపోయిన పక్షుల మృతదేహాలను సరిగ్గా పాతిపెట్టాలి. పక్షుల నమూనాలను సకాలంలో సేకరించి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. పౌల్ట్రీ కార్మికులకు, పక్షులతో దగ్గరగా ఉండే ప్రజలకు టీకాలు వేయాలి. బర్డ్ ఫ్లూ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలను అభివృద్ధి చేశారు.బర్డ్ ఫ్లూ వ్యాప్తిని పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి. పశుసంవర్ధక శాఖ అధికారులు పౌల్ట్రీ ఫారమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ప్రజలకు బర్డ్ ఫ్లూ గురించి అవగాహన కల్పించాలి. పక్షులు ఎక్కడ చనిపోతున్నా.. వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించాలి. పెంపుడు పక్షులను అడవి పక్షులకు దూరంగా ఉంచాలి. పక్షుల వ్యర్థాలను శుభ్రం చేసేటప్పుడు గ్లవ్స్, మాస్క్‌లు ధరించాలి.

## హనుమకొండలో యువకునిపై ముస్లిం యువకుల దాష్టీకం

**హన్మకొండపెన్ పవర్:** న్యూ శాంపేటకు చెందిన సాయి చరణ్ (22) అనే యువకున్ని మైనార్టీ యువకులు కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారు. యువకుడిని బలవంతంగా బైక్ పై ఎక్కించుకొని పలు ప్రాంతాలలో తిప్పుతూ తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ముస్లిం అమ్మాయితో మాట్లాడుతున్నదంటూ సాయి చరణ్ ను చితకబాదారు. బాధితుడు సాయి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి 12 మందిపై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసారు. ముస్లిం అమ్మాయిలతో మాట్లాడుతున్నారని నెపంతో ఇప్పటివరకు 150 మందిని వరంగల్ ఓసిటిలో ఓ పాత బంగ్లాలో కొట్టినట్లు సమాచారం. దాడికి పాల్పడిన పదిమందిలో ఆరుగురిని పోలీసులు జిల్లా జడ్జి ముందు హాజరు పరిచారు.

## దక్షిణాదిలో ప్రత్యేక దేశం కావాలని ఉద్యమం రావచ్చు

**హైదరాబాద్: పెన్ పవర్:** కరీంనగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు చేసారు. దక్షిణాదిలో ప్రత్యేక దేశం కావాలని ఉద్యమం మొదలయ్యే అవకాశం కూడా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో బిజెపిపై వ్యతిరేకత ఉంది . తెలంగాణ ఉద్యమం తరహాలో మొదలయ్యే అవకాశం ఉందంటూ ఓ తెలుగు ఛానల్ తో ఇంటర్వ్యూలో హాట్ కామెంట్స్ చేసారు.

## కృష్ణా జలాల్లో నీటి కొరత ఉండటం వాస్తవమే

**సూర్యాపేట: పెన్ పవర్:** సూర్యాపేట జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పాలకీడు మండలం జానపహాడ్ దర్గాను సందర్శించారు. ఈ నెల 30 న మట్టపల్లిలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30న హుజుర్ నగర్ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణిని ప్రారంభిస్తారు. ఏప్రిల్ నెల నుండి రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తాం. రాష్ట్రంలో 84%మందికి సన్న బియ్యం అందుతాయి. దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల పేదలు తినకుండా అమ్ముకున్నారు. కృష్ణా జలాల్లో నీటి కొరత ఉండటం వాస్తవమే.
శ్రీశైలం నుంచి కరెంట్ తయారీకీ విడుదల చేసిన నీటిని సాగర్ ప్రాజెక్ట్ లోకి విడుదల చేస్తాం. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తాం. సాగర్ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

## బీబీగూడం దగ్గర రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి


**సూర్యాపేట: పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీబీగూడం వద్ద ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న 11 మందిలో ముగ్గురు మృతి చెందగా మరొకరికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ హాస్పిటల్ కి తరలించారు. వివరాల్లోకి వెళితే ఆత్మకూర్ ఎస్ మండలం కోటపాడు గ్రామంలో శుభకార్యానికి పోయి వస్తూ తిరుగు ప్రయాణంలో యాక్సిడెంట్ జరిగిందని సూర్యాపేట జిల్లా డి.ఎస్.పి రవి తెలిపారు. మృతులు గడ్డం రవీందర్ (34), గడ్డం రేణుక (29) రీతిక (7).

## వన్యప్రాణుల మాంసం కలకలం

**నల్గొండ: పెన్ పవర్:** వేములపల్లి (మం) శెట్టిపాలెం ఎరుకలవాడలోని వన్యప్రాణుల మాంసం కలకలం రేపింది. ఓ ఇంట్లో విక్రయిస్తున్న వన్యప్రాణుల మాంసం స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారు నరసింహ గా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో మాసం ఏ జీవిది,ఎక్కడ నుంచి తీసుకువచ్చారని తేలనుంది.

## నకిరేకల్ పదో తరగతి పేపర్ లీక్


- విద్యా వ్యవస్థపై మాయని మచ్చ"



**నల్గొండ: పెన్ పవర్:** నల్గొండ జిల్లా నకిరేకల్లో పదో తరగతి పరీక్ష పత్రం లీక్ అంశం విద్యా వ్యవస్థపై మరోసారి చెరగని మచ్చగా నిలిచింది. ఈ ఘటనలో 12 మంది పై కేసులు నమోదు చేసారు. ఒక విద్యార్థిని రెండు సంవత్సరాల పాటు డిబార్ చేయబడింది.నల్గొండ జిల్లా నకిరేకల్ లో పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజే పదవ తరగతి తెలుగు పేపర్ లేకేజి వ్యవహారం వెలుగులోకివచ్చింది."మార్చి 24, 2024 న నకిరేకల్లో పదో తరగతి తెలుగు పరీక్ష పేపర్ లీక్ కావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగించింది. పరీక్ష ప్రారంభమైన కొన్ని నిమిషాలకే పేపర్ బయటకు రావడం విద్యా వ్యవస్థపై అనుమానాలు రేకెత్తించింది. ఈ ఘటన నకిరేకల్లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుండి లీక్ అయింది. దీనికి బాధ్యుడైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతించకపోవడం, కట్టుదిట్టమైనా నిఘా వున్నా పేపర్ ఎలా లీక్ అయ్యింది అనే దానిపైన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.అసలు ఈ లీకేజీ ఎలా జరిగింది? ఎక్కడి నుండి మొదలైంది? అసలు సూత్రధారులు ఎవరు? ఈ విషయాలన్నీ రాబట్టేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఘటనపై పోలీసులు 12 మంది పై కేసులు నమోదు చేశారు. అందులో 6 మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. అరెస్టైన వారిలో ప్రైవేట్ స్కూల్ టీచర్ గునుగుంట్ల శంకర్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు బ్రహ్మదేవర రవిశంకర్, చిట్ల అశోక్, బండి శ్రీను, చిట్ల శివ, ఒక బాలుడు ఉన్నారు. మిగిలిన నిందితుల్లో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులు, సిబ్బందిపై విద్యాశాఖ చర్యలు చేపట్టింది. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ను పరీక్ష విధుల నుంచి తొలగించింది. ఒక ఇన్విజిలేటర్ సుధారాణి ని సస్పెండ్ చేసింది.ఈ లీకేజీకి సంబంధించి నకిరేకల్ మండల విద్యాధికారి ఎం. నాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రశ్నాపత్రాన్ని బయటకు తెచ్చిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని నకిరేకల్ ఎంఈఓ ఎం. నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

# 27న పోలవరానికి చంద్రబాబు..

**ఏలూరు, మార్చి 24, పెన్ పవర్:** ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే పోలవరం పూర్తి చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి పోలవరం వద్ద పర్యటించనున్నారు. ఈ నెల 27న అంటే గురువారం నాడు పోలవరం వెళ్లి అక్కడ క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో అక్కడే సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర విభజన తర్వాత రెండోసారి అధికారులకు వచ్చిన కూటమి ప్రభుత్వం పోలవరంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టింది . ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ టర్మ్ పూర్తయ్యే లోపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఒక తీరానికి చేర్చాలని చంద్రబాబు ప్రభుత్వం పట్టుదలగా పని చేస్తుందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పదే పదే చెబుతున్నారు.రెండోసారి అధికారం లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలుమార్లు పోలవరం వద్ద పర్యటించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని దగ్గర నుంచి మరోసారి పరిశీలించనున్నట్టు ఏపీ సీఎంవో చెబుతోంది. గురువారం నాడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 వరకు పోలవరంలో చంద్రబాబు టూరు జరగనుంది .మరోవైపు ఇటీవల పార్లమెంట్లో పోలవరం నిర్మాణాన్ని వచ్చే ఏడాది కల్లా పూర్తి చేస్తామని కేంద్ర జల శక్తి మంత్రి అఖీ పాటిల్ స్పష్టం చేశారు. గతంలో చాలా ప్రభుత్వాలు మారినా పోలవరం కి ఏమీ చేయలేదని కానీ ఔఆం అధికారులకు వచ్చిన తర్వాత ప్రధాని మోదీ ఇంతవరకు పోలవరం కోసం 15 వేల కోట్లు కేటాయించారని ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ కేంద్ర జలశక్తి మంత్రి స్పష్టం చేసారు. ఈ ఆర్థిక



సంవత్సరంలో కూడా 12 వేల కోట్లు కేటాయించారని నెక్ట్స్ ఇయర్ కల్లా పోలవరం నిర్మాణాన్ని ఓ దరికి చేరుస్తామని లోక్ సభ లో ప్రస్తావించారు.పోలవరం పూర్తయితే సుమారు మూడు లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని 28 లక్షల మందికి పైగా ప్రత్యక్ష లబ్ధి చేకూరుతుందని అదనంగా మరో 540 గ్రామాలకు శాశ్వతంగా త్రాగునీరు లభిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఇక పోలవరం ఏపీకి జీవనాడి లాంటిదని

ఎప్పటినుంచో చెప్పుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీఏ పై పట్టు చిక్కిన నేపథ్యంలో వీలైనన్ని ఎక్కువ నిధులను సాధించి పోలవరం నిర్మాణం పూర్తి చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు గురువారం చేపట్టిన పోలవరం టూర్ పై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది

# ఏపీ కొత్త డీజీపీ ఎవరు...

**విజయవాడ, మార్చి 24, పెన్ పవర్:** ఏపీకి కొత్త పోలీస్ బాస్ ఎవరు? ఇన్చార్జ్ డిజిపిగా ఉన్న హరీష్ కుమార్ గుప్తా స్థానంలో కొత్త డిజిపి ఎంపిక కోసం కసరత్తు ప్రారంభం అయింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు సీనియర్ ఐపిఎస్ అధికారుల పేర్లను యుపిఎస్సి కి పంపింది. ఇందులో మూడు పేర్లను ఎంపిక చేసి తిరిగి యుపిఎస్సి ప్రభుత్వానికి పంపుతుంది. ఇందులో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డిజిపిగా నియమించే అవకాశం ఉంది. దీంతో కొత్త డిజిపి ఎవరు అన్నదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. గతంలో డీజీపీగా ద్వారకా తిరుమలరావు ఉండేవారు. ఆయన పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం కొత్త డీజీపీని ఎంపిక చేయాల్సి ఉంది. హరీష్ కుమార్ గుప్తా తాత్కాలిక డిజిపిగానే కొనసాగుతూ వచ్చారు.సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ హరీష్ కుమార్ గుప్తాను ఏపీ డీజీపీగా నియమించింది. అయితే ద్వారకాతిరుమలరావును ఎంపిక చేయగా.. ఆయన పదవీ విరమణ చేశారు. దీంతో ఇప్పుడు పూర్తిస్థాయి డీజీపీ ఎంపిక అనివార్యంగా మారింది. హరీష్ కుమార్ గుప్తా తో పాటు ఐదుగురు పేర్లను యూపీఎస్సీకి పంపింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందులో సీనియర్ ఐపీఎస్ లు మాదిరెడ్డి ప్రతాప్, రాజేంద్రనాథ్ రెడ్డి, కుమార్ విశ్వజిత్, సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరిలో ముగ్గురిని యుపిఎస్సి ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది.ప్రస్తుతం ఎన్డీఏ అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. దీంతో డిజిపి ఎంపిక రాష్ట్ర ప్రభుత్వ ఇష్టం పై ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎవరికి బొట్టు పెడితే వారు డిజిపిగా నియమితులు కావడం ఖాయం. అయితే మరోసారి హరీష్ కుమార్ గుప్తాకు అవకాశం ఇస్తారా? లేకుంటే కొత్త అధికారిని తెరపైకి తెస్తారా అన్నది చూడాలి. అయితే రాజేంద్రనాథ్ రెడ్డి ఎంపిక ఉండదు. గతంలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజిపిగా పనిచేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుకూల అధికారిగా ఆయనపై ముద్ర ఉంది. మాదిరెడ్డి ప్రతాప్ కానీ.. హరీష్ కుమార్ గుప్తా కానీ డిజిపిగా ఎంపిక అయ్యే అవకాశం కనిపిస్తోంది.

# కేసీఆర్ ధీమా....ఏంటీ

**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:** మళ్లీ నేనే సీఎం.. రాస్కో సాంబా.. అంటూ గబ్బర్‌సింగ్ రేంజ్‌లో డైలాగులు కొడుతున్నారు కేసీఆర్. ఫాంహౌజ్‌లో తనను కలిసిన బీఆర్ఎస్ నాయకుల ముందు మాటల గారడీ చేస్తున్నారా? కేడర్‌ను కాపాడుకునేందుకు తనదైన స్టైల్‌లో కన్ఫ్యూజ్ చేస్తున్నారా? మాయల మరాఠీ, టక్కుటమారం విద్యలు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్ చెప్పే ముచ్చట్లు.. ఆయన ముచ్చట తీర్చేనా?కేసీఆర్ లేటెస్ట్ కామెంట్స్ పొలిటికల్‌గా కాక రేపుతున్నాయి. రాబోయే రోజుల్లో అధికారం బీఆర్ఎస్‌దే అన్నారు. ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు సీఎం అయ్యేవారే కాదని.. తాము మాత్రం సింగిల్‌గా పవర్‌లోకి వస్తామని చెప్పారు. ఆనాడు మోదీ తన మెడపై కత్తి పెట్టినా.. తెలంగాణ కోసం తాను ఎక్కడా వెనకడుగు వేయలేదని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాష్ట్రం సమస్యల వలయంలో చిక్కుకుందని ఆరోపించారు. బెల్లం ఉన్న దగ్గరికే ఈగలు వస్తాయని.. ఇప్పుడు తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని అన్నారు.కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కస్సున లేచారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఊహాలోకంలో ఉంచండి.. మీరేమో ఫాంహౌజ్‌లోనే ఉండండి అంటూ సెటైర్లు వేశారు. మీరు ఎన్ని కలలు కన్నా.. అధికారంలోకి రావడం అసంభవం అని తేల్చి చెప్పారు సీతక్క.అటు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం గులాబీ బాస్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని.. కేసీఆర్ పగటి కలలు మానుకోవాలని హితవు పలికారు. సింగిల్‌గానే కాదు.. కేసీఆర్ బీజేపీతో జతకట్టినా గెలవలేరని.. మళ్లీ అధికారం కాంగ్రెస్ పార్టీదేనని తేల్చి చెప్పారు. ఫాంహౌజ్‌లో ఉండి కేసీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ సృష్టించిన ఆర్థిక విధ్వంస పునాధుల మీద.. రైజింగ్ తెలంగాణను పునర్ నిర్మిస్తున్నామని కాంగ్రెస్ చీఫ్ తెలిపారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ చూసి బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. కుటుంబం కోసం తెలంగాణ ప్రయోజనాలను పదేళ్ల పాటు ప్రధాని మోదీ ముందు తాకట్టు



పెట్టారని మండిపడ్డారు మహేశ్ కుమార్ గౌడ్.రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా.. కేసీఆర్ వైఖరి మాత్రం ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీకి రాకున్నా, ప్రజల్లోకి వెళ్లకున్నా.. ఫాంహౌజ్‌లో మకాం వేసి రాజకీయ మంటలు రాజేసే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. మళ్లీ గెలుస్తామని.. తాను మరోసారి ముఖ్యమంత్రి అవుతానంటూ.. కేసీఆర్ మైండ్ గేమ్ అడుతున్నారని అంటున్నారు. అమావాస్యకో, పున్నమికో.. ఎర్రవల్లి ఫాంహౌజ్‌కు పార్టీ నేతలను రప్పించుకోవడం.. వచ్చేది మన ప్రభుత్వమే అంటూ వారికి భరోసా ఇవ్వడం కేసీఆర్‌కు రొటీన్ ప్రోగ్రామ్‌గా మారింది.కాంగ్రెస్‌లో ఏదో అయిపోతోంది.. అన్నివర్గాల్లో వ్యతిరేకత వస్తోంది.. అంటూ ఫేక్ ప్రచారాన్ని ప్రజలపై బలంగా రుద్దే ప్రయత్నం జరుగుతోందని చెబుతున్నారు. ఈ కుట్రను గుర్తించే.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా చేస్తున్న ఫేక్ ప్రచారంపై ఫైర్ అవుతున్నారు. దోచుకుని దాచుకున్న బ్లాక్ మనీతో కేటీఆరే ఇదంతా చేయిస్తున్నారని మండిపడుతున్నారు. కేటీఆర్ సోషల్ మీడియాలో.. కేసీఆర్ ఫాంహౌజ్‌లో.. ఇద్దరూ కలిసి రేవంత్ సర్కార్‌ను బద్నామ్ చేసే కుతంత్రం అమలు చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు కాక మీదున్నాయి. మళ్లీ తానే సీఎం అవుతానంటూ కేసీఆర్ చేస్తున్న ఈ కామెంట్స్ మైండ్ గేమ్ మినహా మరోటి కాదని.. బీఆర్ఎస్‌కు అంత సీన్ లేదని.. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమేనని తేల్చిచెబుతున్నారు హస్తం నేతలు.

# నయీామ్ ఆస్తులపై అక్రమార్కుల కన్ను

**నల్గొండ, మార్చి 24,పెన్ పవర్:**
నయీామ్ ఎప్పుడో ఎన్‌కౌంటర్‌లో పోయాడు. కానీ.. అతను సంపాదించిన అక్రమాస్తులు అలాగే ఉన్నాయి. ఇప్పుడు.. నయీామ్ పేరుపై ఉన్న అక్రమ భూములపై కొందరి కన్నుపడింది. సిట్ విచారణతో.. నయీామ్‌కు సంబంధించిన భూముల్ని ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. కానీ.. కొందరు బడాబాబులు అధికారులతో కలిసి.. ఆ భూముల్ని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. ఇప్పుడు మీరు చూస్తున్న ఈ వెంచర్.. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోనిది. విజయ్ జేబీ ఇన్‌ఫ్రా పేరిట భారీ హోర్డింగులు పెట్టి.. 222 ఎకరాల లే అవుట్ అంటూ ప్రకటనలిస్తున్నారు. అయినా.. అధికారులు పట్టించుకోవట్లేదు.1991లో ఎస్వీఎస్ రియల్ పేరుతో.. 108 ఎకరాల స్థలం ఇది. తర్వాత.. విజయ్ జేబీ ఇన్‌ఫ్రా వాళ్లు కొనుగోలు చేసి.. 222 ఎకరాల మెగా లేఅవుట్‌గా డెవలప్ చేశారు. ప్లాట్లు అమ్మేస్తున్నారు. అక్కడున్న పరిస్థితుల్ని తెలుసుకోగా.. కేవలం 108 ఎకరాల భూమి మాత్రమే లేఅవుట్‌కి సంబంధించింది. సర్వే నెంబర్ 12, 13, 14లో ఉన్న 56 ఎకరాలు నయీామ్ పేరిట ఉన్న భూములు. అదేవిధంగా సర్వే నెంబర్ 17, 18లో 26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇలా.. మొత్తంగా 80 ఎకరాల భూముల్ని.. అక్రమంగా వెంచర్‌లోనే కలిపేశారు.108 ఎకరాలున్న లేఅవుట్‌ని.. 222 ఎకరాలుగా చూపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని బిగ్ టీవీ వెలుగులోకి తీసుకురావడంతో.. హోర్డింగుల్లో 222 ఎకరాలు కనబడకుండా కవర్ చేశారు. విజయవాడ హైవే నుంచి వెంచర్‌లోకి వేసిన రోడ్డుకు.. 30 ఫీట్ల వరకే పర్మిషన్ ఉంది. అడ్డదారిలో.. 60 ఫీట్ల రోడ్డు కోసం పర్మిషన్ తెచ్చుకోవడం కూడా చర్చనీయాంశంగా మారింది.
విజయ్ జేబీ ఇన్‌ఫ్రా వెంచర్ వ్యవహారాన్ని..యాదాద్రి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై సీరియస్‌గా స్పందించిన అధికార యంత్రాంగం.. ఆర్డీవోతో విచారణ జరిపిస్తున్నారు.

# మహనీయుల జయంతి నిర్వహణ కమిటీ ఎన్నిక

**పెద్దపల్లి ప్రతినిధి:పెన్ పవర్:** మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీని స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఎన్నుకున్నారు. ఇందులో ఉత్సవ కమిటీ చైర్మన్ గా స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావును ఏకగ్రీవం చేసుకోగా, కన్వీనర్లుగా బొంకూరి కైలాసం, మాటూరి దుర్గయ్య, కుక్క చంద్రమొగిలిలను ప్రకటించు కున్నారు. కాగా ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్, 11న మహాత్మా జ్యోతి రావు పూలె, 14న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు పెద్దపల్లిలో ఘనంగా నిర్వహించేందుకు జయంతి ఉత్సవ కమిటీ నియామకం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుమ్మరి అంజయ్య, కుక్క చంద్రమోగిలి, మాటూరి దుర్గయ్య, మహేష్, కండె కరుణాకర్, అరకిల్ల లక్ష్మన్, కల్వల మల్లేష్, నేర్వెట్ల రామస్వామి, కాంపెల్లి చంద్రశేఖర్, కాంపెల్లి మల్లేష్,
చంటి గణపతి, రామిళ్ల శారద, దేవయ్య, దుస్సా అశోక్, జనగామ జనార్దన్, కల్వల రాజేష్, ఎనగందుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ గుర్తింపు అటెండెన్స్ ప్రక్రియ విరమించుకోవాలి

## హేచ్-1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి

**పెద్దపల్లిప్రతినిధి: పెన్ పవర్:** రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పని చేసే ఉద్యోగుల ముఖ గుర్తింపు జియో అటెండెన్స్ సిస్టమ్ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్- 1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితోపాటు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. రాజశేఖర్, ఎ శ్రీనివాస్, రమేష్ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైద్య ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మొబైల్ ఎనేబుల్డ్ ఫేషియల్ అథెంటిఫికేషన్ అండ్ జియో ఫీల్డ్ హాజరు అమలు చేయుట కు ఉద్యోగుల వివరాల సేకరణకు విడుదల చేసిన సర్క్యులర్ వెంటనే రద్దు చేయాలని ఉద్యోగుల పక్షాన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సిస్టం మొదటగా ఖమ్మం జిల్లాలో ప్రవేశపెట్టి పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాలు, పల్లె దావఖాన, బస్తీ దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, పలు ఇనిస్టిట్యూషన్లలో ఈ సిస్టం అమలు చేయడం వలన క్షేత్ర స్థాయి ఉద్యోగుల సమయం వృదా చెయ్యడం తప్ప ప్రభుత్వానికి మరేలాంటి ప్రయోజనం లేదన్నారు. దీంతో ఉద్యోగులకు తగిన సమయం సరిపడక, ఆరోగ్య కార్యక్రమా ల అమలుకు బంగం కలిగే ప్రమాదం లేకపోలేదన్నారు. వెంటనే విరమించుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, ఆశావర్కర్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూన్నారని, ఏటా పెరిగిపోతున్న ఆరోగ్య కార్యక్రమాలతో క్షేత్రస్థాయి సిబ్బంది పని ఒత్తిడికి గురవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు కనీస ఫిక్సుడు వేతనాల అమలు, రెగ్యూలర్ నియామకాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చే వెయిటేజీ, ఉద్యోగుల పదోన్నతులు వంటి అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపో యి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హేచ్ -1 యూనియన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల సాధనకు కృషిచేస్తుందన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఆరెల్లి లక్ష్మణ్, కార్యదర్శిగా నాగభూషణం, కోశాధికారిగా సీతారమయ్య, అద్వజర్ గా మేరీ సంపూర్ణ, మరో 30 మందితో జిల్లా కమిటి ఏర్పాటు చేశారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి రాజశేఖర్, రాష్ట్ర నాయకులు ఏ. శ్రీనివాసు, శ్రీనివాస్, వినిత్ లు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఈ కార్యక్రమం లో శ్రీనివాస్, రమేష్, చంద్రమౌళీ, వైద్య ఉద్యోగులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# 100 మందికి 105 ఫోన్లు...



**హైదరాబాద్, మార్చి 24 పెన్ పవర్:** తెలంగాణలో మొబైల్ వినియోగదారులు ఉన్న జనాభా కంటే ఎక్కువ ఉన్నట్టు ట్రాయ్ ఓ నివేదిక విడుదల చేసింది. సెప్టెంబర్ వరకు ఉన్న డేటా ప్రకారం తెలంగాణలో టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 4.19 కోట్లు. ఇందులో మొబైల్ వినియోగదారులు 4.4 కోట్ల మంది, ల్యాండ్‌లైన్ వినియోగదారుల 15.25 లక్షల మంది ఉన్నారు. రాష్ట్ర వైర్‌లెస్ టెలీ డెన్సిటీ 105.32 శాతం అంటే ప్రతి 100 మందికి 105కిపైగా మొబైల్ ఫోన్లు ఉన్నట్టు నివేదికలో తేలింది. ఈ డెన్సిటీలో గోవా టాప్‌లో ఉంటే తర్వాత స్థానం కేరళది. అనంతరం హర్యానా మూడో స్థానం ఉంది. తెలంగాణ నాల్గో స్థానంలో ఉంది. టాప్‌లో ఉన్న గోవాలో ప్రతి వందమందికి 152 ఫోన్‌లు కలిగి ఉన్నారు. కేరళ-115, హర్యానా 114 శాతం ఉందన్నమాట. డిజిటల్ కనెక్టివిటీలో తెలంగాణకు ఇదో మైలురాయిగా చెప్పవచ్చు. ప్రస్తుతం జాతీయ సగటు 82 శాతమే ఉంటే తెలంగాణ వంద దాటిపోయింది. ఇది తెలంగాణ వ్యాప్తంగా డిజిటల్ సదుపాయాలు ఏ స్థాయిలో విస్తరిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. టెలిఫోన్ వినియోగంలో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. గ్రామాల్లో 39 శాతం ఉంటే... పట్టణాల్లో 60 శాతంపైగా ఉంది. మొబైల్ ఫోన్ల వినియోగంలో గ్రామాల్లో 41శాతం ఉంటే... పట్టణాల్లో 59శాతంగా ఉంది. ల్యాండ్‌లైన్ ఫోన్‌లను గ్రామాలల్లో కేవలం నాలుగు శాతం మందే వాడుతుంటే పట్టణాల్లో పట్టణాల్లో 96 మంది యూజ్ చేస్తున్నారు. డిజిటల్ కనెక్టివిటీని విస్తరించడానికి, ఇంటర్నెట్ యాక్సెస్‌ను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయి. మొబైల్ నెట్‌వర్క్ కవరేజీ మెరుగుపరిచి ఇంటర్నెట్ సేవలు అందడంతో ఎక్కువ మంది డిజిటల్ వైపు మొగ్గుతున్నారు. ఇది గ్రామీణ, పట్టణ జనాభాపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఇలా డిజిటల్ పెసిలిటీ పెరుగుదల విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపారం, పాలనకు సహాయకారిగా ఉంటాయి.

# టన్ను మామిడి రూ.1.22 లక్షలు

**వరంగల్, మార్చి 24, పెన్ పవర్:** వేసవి వచ్చేసింది?! దీంతో తెలుగు రాష్ట్రాల్లో మామిడపండ్ల సీజన్ మొదలైపోయింది. ఇప్పటికే కోతకు వచ్చిన పంటను? మార్కెట్లకు తరలిస్తున్నారు. పలుచోట్ల విక్రయాలు కూడా కొనసాగుతున్నాయి. అయితే ఇందులో బంగినపల్లి మామిడికి మంచి పేరు ఉంటుంది. మామిడిలో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ? బంగినపల్లికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందేస్థానికం నుంచి ప్రపంచం వరకు బంగినపల్లి మామిడిపండ్లు ఎగుమతి చేస్తుంటారు. అయితే గురువారం వరంగల్ లోని ఎనుమాముల ముసలమ్మకుంటలో నూతన మామిడి మార్కెట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగినపల్లి మామిడి రికార్డ్ ధర పలికింది.జిల్లా కలెక్టర్ తో పాటు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా మార్కెట్ లో నిర్వహించిన వేలంలో వ్యాపారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇందులో బంగినపల్లి మామిడికి టన్ను రూ.1.22 లక్షల వరకు పలికింది. ఈ సీజన్ లోనే కాదు మార్కెట్ చరిత్రలోనే ఇంత ధర పలకటం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన విజయపాల్ రెడ్డి ఈ పంటను పండించాడు. మార్కెట్ వేలంలో రూ.1.22 లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు.

## విశాఖ మేయర్ పై అవిశ్వాసం.. ?

**విశాఖపట్టణం, మార్చి 24, పెన్ పవర్:**గ్రేటర్ విశాఖ మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి కూటమి నేతలు స్కెచ్ వేశారు. కలెక్టర్ ను కలిసి మేయర్ హరి కుమారిపై అవిశ్వాస నోటీసు ఇచ్చిన కూటమి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వైసీపీ తరపున మేయర్ గా ఉన్న గొలగాని వెంకట హరికుమారిపై అవిశ్వాసం పెట్టేందుకు కూటమి కార్పొరేటర్లు కొంత కాలంగా సన్నాహాలు చేసుకుంటున్నారు. వైసీపీకి చెందిన కనీసం ముప్పై మంది కార్పొరేటర్లు ఇప్పటికే పార్టీ ఫిరాయించారు. మొత్తం 99 మంది కార్పొరేటర్లు ఉన్న కార్పొరేషన్ లో ఇప్పుడు వైసీపీకి పాతిక మంది కార్పొరేటర్లు కూడా లేరు. అయినా మేయర్ పీఠాన్ని నిలబెట్టుకుంటామని కొత్త ఇంచార్జ్ కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ధీమాగా ఉన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం మొదటి సారి ఎన్నికైన తర్వాత నాలుగేళ్ల వరకూ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. ఇప్పుడు మేయర్ పదవి కాలం నాలుగేళ్లు పూర్తయింది ఇప్పటికే పార్టీలో చేరిన వారు.. కూటమి కార్పొరేటర్లు కలిసి మేయర్ ను దింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుత మేయర్ పై అనేక ఆరోపణలు ఉన్నాయి. మేయర్ అభ్యర్థిగా కూటమి తరపున ఎవరిని ఖరారు చేయాలన్నదానిపై చర్చలు జరుపుతున్నారు. విశాఖ మేయర్ పీఠం వైసీపీ నుంచి జారిపోవడం ఖాయంగా ఉంది. అయితే అమర్నాథ్, కన్నబాబులకు పార్టీ హైకమాండ్ మాత్రం వార్నింగ్ ఇచ్చింది. కార్పొరేటర్లను జారిపోకుండా చూసుకుని కూటమికి షాక్ ఇవ్వాలని ఆదేశించింది. దాంతో వారిద్దరూ తమ శక్తికి మించి ప్రయత్నిస్తున్నారు. కానీ వారి మాటల్ని కార్పొరేటర్లు వినే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తు బలం ప్రకారం శాఖపట్నం, అనకాపల్లి కూటమి తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కలుపుకుని 109 ఓట్లకుగాను, కూటమి బలం 73కు చేరింది. సీపీఐకి చెందిన స్టాలిన్, ముత్తంశెట్టి కూతురు కూటమికే మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.విశాఖలో వైసీపీకి ముఖ్య నేతలు ఉన్నారు. మండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న బొత్స సత్యనారాయణ ఇంచార్జ్ గా లేకపోయినా ఉత్తరాంధ్ర సీనియర్ నేతగా... విశాఖ ఎంపీ స్థానానికి ఆయన భార్యతో పోటీ చేయించిన వ్యక్తిగా ఆయన బాధ్యత తీసుకుని మేయర్ పీఠం చేజారకుండా చేయాల్సి ఉంది. అలాగే విజయసాయిరెడ్డి రాజీనామాతో కొత్తగా ఇంచార్జ్ గా నియమితులైన మాజీ మంత్రి కన్నబాబు కూడా ప్రయత్నిస్తున్నారు. గుడివాడ అమర్నాథ్ .. పార్టీ మారిన కార్పొరేటర్లతోనూ చర్చలు జరుపుతున్నారు. వీరి ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో చూడాల్సి ఉంది. వచ్చే వారం కౌన్సిల్ సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ పెట్టే అవకాశాలు ఉన్నాయి.

## స్వామి వారితో పెట్టుకుంటే అంతే

**అనంతపురం, మార్చి 24, పెన్ పవర్:** అనంతపురం జిల్లా ఉరవకొండ మండలంలో ఉన్న పెన్నహోబిలం లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో సిబ్బంగదిచేతివాటం ప్రదర్శించారు. భక్తులు హుండీలో వేసిన నగల మూటను తస్కరించే ప్రయత్నం చేశారు. అయితే వారి ప్లాన్ బెడిసి కొట్టి.. నగలమూటను తిరిగి హుండీలో వేయాల్సి వచ్చింది. ఈ ఘటన కలకలం రేపింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. వేలూరు రంగయ్య అనే వ్యక్తి భార్యతో కలిసి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని గతేడాది దర్శించుకున్నారు. డిసెంబర్ ఏడో తేదీన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న వేలూరు రంగయ్య దంపతులు.. మొక్కులు చెల్లించుకున్నారు. రూ.8లక్షల విలువైన నగలను మూట కట్టి ఆలయ హుండీలో వేశారు.అయితే పెన్నహోబిలం లక్ష్మి నరసింహస్వామి ఆలయ అధికారులు ఇటీవల హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. మార్చి 18వ తేదీన ఈవో రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సమయంలో కొంతమంది సిబ్బంది.. హుండీలోని ఈ నగలమూటను గుర్తించారు. నగలను కాజేయాలనే దుర్బుద్ధితో మూటను దాచి పెట్టారు. మొత్తం హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక.. ఈ నగల మూటను పంచుకోవాలని ఆలయ సిబ్బంది పక్కాగా ప్లాన్ వేసుకున్నారు. అయితే కథ అడ్డం తిరిగింది.పంపకాల్లో తేడా రావటంతో సీన్ రివర్సైంది.ఈలోపే నగల మూట మాయమైందనే విషయం బయటకు వచ్చింది. వేలూరు రంగయ్య దంపతులు ఆలయ పూజారి ఎదుటే హుండీలో నగల మూట వేశారు. అయితే లెక్కించేటప్పుడు నగలమూట కనిపించకపోవటంతో నగలు మాయమయ్యాయనే విషయం బయటకు వచ్చింది. దీనికి తోడు పంపకాల సమయంలో తేడా రావటంతో.. ఏం చేయాలో పాలుపోక సిబ్బంది బుధవారం రాత్రి నగల మూటను తీసుకువచ్చి తిరిగి హుండీలో వేశారు. గురువారం ఆలయ అధికారులు ఈ విషయాన్ని గుర్తించారు. ఆలయ హుండీలో వేసిన నగల మూటను చోరీ చేసేందుకు యత్నించడంపై భక్తులు మండిపడుతున్నారు.ఈ ఘటనపై ఏపీ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.పెన్నహోబిలం లక్ష్మి నరసింహస్వామి ఆలయం పెన్నా నది ఒడ్డున కొలువై ఉంది. ఈ ఆలయానికి ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉంది. ఐదు అడుగుల మూడు అంగుళాల లక్ష్మి నరసింహస్వామి పాదముద్రపై ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏటా ఏప్రిల్ నెలలో ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఈ ఆలయం వివాహ వేడుకలకు ప్రసిద్ధి చెందింది.

## మట్టి కుండనే కదా అని లైట్ గా తీసుకోకండి.

-మట్టి కుండ లో నీరు తాగటం వల్ల ఎన్నో ప్రయోజనాలు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )



మట్టి కుండనే కదా అని లైట్ గా తీసుకోకండి.
మట్టి కుండ లో నీరు తాగటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.
అయుర్వేద నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం కుండలోని నీటిని వినియోగించడం వలన జీర్ణశక్తి వృద్ధి చెందుతుంది. ఈ నీటివలన శరీరంలోని టెస్టోస్టెరాన్ స్థాయి పెరుగుతుంది.ఫ్రిడ్జ్ కు బదులు మట్టికుండలోని నీరు మనకు అవసరమైనంత చల్లగా ఉండటంతోపాటు పలు ప్రయోజనాలను అందిస్తుంది. ఆరోగ్యానికి కూడా ఈ నీరు తాగడం అత్యుత్తమం.కుండలో నీళ్ళు త్రాగితే అల్కలైన్ అనే పదార్థం ఉంటుంది ఇది శరీరంలో అనవసరపు గ్యాస్ ని బయటకు తరిమేసి శరీరంలో మరియు పొట్టలోని చల్లదనం ఇస్తుంది.కుండలోని నీరు సహజసిద్ధంగా చల్లబడుతుంది. అందుకే ఈ నీరు శరీరానికి హాని చేయదు. జలుబు దగ్గు గొంతు నొప్పి ఇవేం రావు. అలాగే చల్లగా నిరు కూడా త్రాగిన తృప్తి ఉంటుంది.జలుబు,దగ్గు మరియు గొంతు నొప్పి ఫ్రిడ్జ్ లో నీళ్ళు త్రాగగానే వెంటనే జలుబు వచ్చేస్తుంది, కాని కుండ లోని నిరు త్రాగితే ఎంతో చల్లగా మరియు దాహం తీరుతుంది.ఫ్రిజ్లోని నీరు తాగడంతో వచ్చే గొంతు సమస్యలు కుండలోని నీటితో తలెత్తవు. చల్లటి ఫ్రిజ్ నీరు తాగితే గొంతు సమస్యలు, జలుబు రావటానికి అవకాశం ఉంది.పిల్లలకి మరియు పెద్దలకి వడదెబ్బ నుండి రక్షణ ఇస్తుంది. ఇది మట్టి తో చెయ్యడం వల్ల దానిలో ఎంతో చలవ చేసే పదార్థం ఉంటుంది. వడదెబ్బ నుండి రక్షణ ఇస్తుంది.
అలాగే శరీరం వేడి ఎక్కకుండా ఉష్ణోగ్రత పెంచకుండా ఉంటుంది. ఫ్రిజ్లోని నీటి కన్నా కుండలోని నీరు ఆరోగ్యదాయకం. ఇది శరీర ఉష్ణోగ్రతను తగిన స్థాయిలో నిలిపివుంచుతుంది.

# శ్యామల ఔట్...?





**విజయవాడ, మార్చి 24, పెన్ పవర్:** బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామలపై కేసు నమోదైంది. సినీ సెలబ్రిటీలతో పాటు శ్యామల పేరు కూడా నిందితుల జాబితాలో చేరింది.. కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేసిన శ్యామల ఇప్పుడు అరెస్ట్ భయంతో కోర్టులని ఆశ్రయిస్తున్నారు.. శ్యామల బుక్ అవ్వడంతో ఆమెను అధికార ప్రతినిధిగా నియమించుకున్న వైసీపీ ఇరుకున పడింది.. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు సంబంధించిన కేసులో వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామలపై కేసు నమోదవ్వడంతో రాజకీయ దుమారం రేగుతోంది. అధికార కూటమి పార్టీలు అటు శ్యామలను, ఇటు వైసీపీని ఒక రేంజ్లో టార్గెట్ చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అధికార ప్రతినిధిగా శ్యామలను నియమించారు. అధికార ప్రతినిధిగా ప్రభుత్వ విధానాలపై ప్రెస్ మీట్‌లు పెడుతున్న శ్యామల విలువలు, ప్రజాసమస్యల గురించి గొప్పగొప్ప స్పీచ్‌లు ఇస్తుంటారు. ఇప్పుడామే జనాన్ని అడ్డంగా దోచుకునే దందాకు ప్రమోటర్‌గా కేసులో ఇరుక్కోవడం తీవ్ర విమర్శల పాలవుతోంది.. అటు కూటమి పార్టీలతో పాటు ఆమె వ్యవహారం వైసీపీలో చర్చనీయాంశంగా మారింది.ఏపీ రాజకీయాల్లో శ్యామల ఎపిసోడ్ హాట్ టాపిక్‌గా మారింది.. తెలంగాణ పోలీసులు శ్యామలతో పాటు పలువురు బుల్లితెర నటులు, యూట్యూబర్లపై హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో శ్యామల అంశం రాజకీయంగా వైసీపీని ఇరుకున పడేసింది. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ అమాయకుల జీవితాలతో ఆడుకుంటూ.. కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నాయి.వైసీపీ అధికార ప్రతినిధిగా శుద్దపూస కబుర్లు చెప్పిన శ్యామల చేస్తుంది ఏంటని టీడీపీ,జనసేన, బీజేపీ అభిమానులు ఆమెతో పాటు వైసీపీని కూడా ఒక రేంజ్లో ట్రోల్ చేస్తున్నారు.. శ్యామల ఇష్యూ చర్చల్లో నలుగుతూ తీవ్ర దుమారం రేపుతుండటంతో .. దానిపై వైసీపీ సమాధానం చేప్పుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అయితే వైసీపీ నాయకులు ఎవరూ దానిపై నోరు మెదపడం లేదు.బెట్టింగ్ క్వీన్ అంటూ మీమ్స్, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వైసీపీ అంటే విలాసవంతమైన బెట్టింగ్ పార్టీ అని కొందరు ట్వీట్లు చేస్తూ ఫ్యాన్ పార్టీ ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేస్తున్నారు. టీడీపీతో పాటు జనసైనికులు శ్యామలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌ను ఓడిస్తామని ఎగిరెగిరిపడ్డ శ్యామల ఇప్పుడు బెట్టింగ్ కేసులో బుక్కై ఓడిపోయిందని జనసేన శ్రేణులు ట్రోల్స్ చేస్తున్నారు.బీజేపీ సోషల్ మీడియా వర్గాలు కూడా ఆ మాజీ యాంకర్‌ని ఆడుకునే పనిలో పడ్డాయి. బెట్టింగ్ యాప్‌లతో పేదల డబ్బు దోచుకుని కోట్లు కూడబెట్టడం వైసీపీ నేతలకు అలవాటేనని బీజేపీ అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారట. శ్యామల వ్యవహారంపై అధికార పక్షం నుంచి విమర్శలు దాడి పెరగడంతో వైసీపీ పూర్తిగా డిఫెన్స్‌లో పడ్డట్లైంది. అధికార ప్రతినిధిగా ఉన్న శ్యామల బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసుల్లో ఇరుక్కోవడంతో వైసీపీలో కూడా పెద్ద చర్చే జరుగుతోందంట.శ్యామల ప్రభావం పార్టీ ఇమేజ్‌ను మరింత దెబ్బతీసే అవకాశం ఉందని వైసీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారట. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన శ్యామలను అధికార ప్రతినిధిగా నియమించడాన్ని కొందరు నేతలు తప్పుపడుతున్నారంట. ఎలాంటి రాజకీయ అనుభవం లేకుండా, పార్టీకి ఎలాంటి సేవ చేయకుండా.. బుల్లితెర మీద నుంచి డైరెక్ట్‌గా పార్టీలోకి వచ్చిన శ్యామలకు అంత ప్రయారిటీ ఇచ్చి.. సెల్ఫ్‌గోల్ చేసుకున్నామని వైసీపీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయంట.పార్టీ అధ్యక్షుడు జగన్‌కి తెలిసే శ్యామలను అధికార ప్రతినిధిగా ప్రకటించారా.. లేదా కోటరీ హస్తం ఉందా అనే సందేహాలను కొందరు నాయకులు వ్యక్తం చేస్తున్నారట. శ్యామలను అధికార ప్రతినిధిగా నియమించడం వెనక పార్టీలోని కోటరీ హస్తం ఉందనే అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారట. కూటమి పార్టీలన్నీ శ్యామల విషయంలో వైసీపీని టార్గెట్ చేస్తుండటంతో ఆ పార్టీలోనే శ్యామలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.బెట్టింగ్ కేసులో పార్టీ అధికార ప్రతినిధి ఇరుక్కోవడం పొలిటికల్‌గా పెద్ద డ్యామేజే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఎలా స్పందించాలో తెలియక పార్టీ అధినాయకత్వం తర్జనభర్జనలు పడుతందంట. శ్యామల ఎపిసోడ్‌పై అధినేత జగన్మోహన్ రెడ్డి ఇంకా అధికారికంగా స్పందించలేదు. అయితే, పార్టీలో జరుగుతున్న అంతర్గత చర్చల్లో శ్యామల అంశంపై ఎలా స్పందించాలనే చర్చ నడుస్తోందట. ఈ కేసుకు పార్టీకి ఏం సంబంధమనే చర్చను కొందరు నాయకులు తీసుకువస్తున్నారట. బెట్టింగ్ యాప్ ప్రయోషన్ అంతా శ్యామల వ్యక్తిగత అంశంగా చూడాలని అంటున్నారట.తాము సమాజ హితాన్ని కాంక్షిస్తూ, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టుగా కనిపించడానికి వైసీపీ శ్యామలపై వేటు వేసే అవకాశం ఉన్నదని పలువురు అంచనా వేస్తున్నారు.
బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్స్ వ్యవహారం బయటపడగానే.. వైసీపీ మీడియా ఒక స్పెషల్ ప్రోగ్రాం చేసింది. సమాజం పట్ల మీకు బాధ్యత లేదా అని వారిని నిలదీస్తూ.. నిందిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కేసుల్లో ఇరుక్కున్న అనేకమంది ఫోటోలతో ప్రోమోను కూడా రిలీజ్ చేసింది. అయితే అందులో వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల, ప్రకాష్ రాజ్ ల ఫోటోలు మాత్రం కనిపించలేదు.స్టార్స్ కాదు సెలబ్రెటీల ముసుగులో ఉన్న చీడ పురుగులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ కాదు.. యాంటీ సోషల్ ఎలిమెంట్స్, బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న చీటర్స్, తమను ఆరాధించే అభిమానుల కుటుంబాలను రోడ్డున పడేస్తోన్న దుర్మార్గులు.. అంటూ సమాజ హితాన్ని కాంక్షిస్తూ బోల్డు వ్యాఖ్యలు చేసింది. మరి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై ఆ స్థాయిలో ధ్వజమెత్తిన వైసీపీ మీడియా ఇదే కేసుల్లో నిందితురాలిగా ఉన్న తమ పార్టీ నాయకురాలు శ్యామలపై ఏం చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# భారీగా పెరుగుతున్న జీవన ప్రమాణాలు

**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:**పెరుగుతున్న టెక్నాలజీతోపాటు.. జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయి. మరోవైపు కంపెనీలు కూడా ఉద్యోగులకు మంచి వేతనాలే ఇస్తున్నాయి. కూలి రేట్లు కూడా భారీగానే పెరిగాయి. ఈ నేపథ్యంలో జీవన ప్రమాణం పెరుగుతోంది.భారతదేశంలో జీవన వ్యయం(లివింగ్ కాస్ట్) పెరుగుతోంది. అత్యాధునిక సౌకర్యాలు, నిత్యావసర వస్తువుల ధర పెరుగుదల, అద్దెలు, పెట్రోల్ ధరలు, రవాణా చార్జీలు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. ప్రతీ ధర పెరిగింది. మరోవైపు వేతనాలు కూడా పెరిగియి. దీంతో మనుషుల జీవన ప్రమాణం కూడా గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లో ఎక్కువగా ఉంటుంది. లివింగ్ కాస్ట్ ఎక్కువగా ఉన్న నగరాలు సాధారణంగా మెట్రోపాలిటన్ నగరాలు, ఆర్థిక కేంద్రాలుగా పరిగణించబడతాయి. ఇవి గృహ ఖర్చులు, రవాణా, ఆహారం, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాల ఆధారంగా నిర్ణయించబడతాయి. దేశంలో లివింగ్ కాస్ట్ ఎక్కువగా ఉన్న కొన్ని ప్రధాన నగరాలు ఇక్కడ ఉన్నాయి.
ముంబై భారతదేశ ఆర్థిక రాజధానిగా పిలవబడే ముంబైలో గహ ఖర్చులు (రెంట్, రియల్ ఎస్టేట్ ధరలు) చాలా ఎక్కువ. ఇక్కడ జీవనశైలి, రవాణా, వినోద ఖర్చులు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇది దేశంలోనే అత్యంత ఖరీదైన నగరంగా పరిగణించబడుతుంది.

**న్యూ ఢిల్లీ**

రాజధాని నగరంగా, ఢిల్లీలో గృహ ఖర్చులు, రవాణా, మరియు జీవన సౌకర్యాలు ఖరీదైనవి. ఇక్కడ అధునాతన సౌకర్యాలు, విద్యా సంస్థలు, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటం వల్ల జీవన వ్యయం పెరుగుతుంది.

**బెంగళూరు**

ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందిన బెంగళూరులో గత కొన్నేళ్లలో జీవన వ్యయం గణనీయంగా పెరిగింది. అద్దెలు, రవాణా, ఆహార ఖర్చులు ఇక్కడ ఎక్కువగా ఉంటాయి, ముఖ్యంగా ఐటీ ప్రాంతాలైన వైట్‌ఫీల్డ్, కోరమంగళలలో జీవన ప్రమాణం చాలా ఎక్కువ.

**చెన్నై**

దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల్లో ఒకటైన చెన్నైలో గృహ ఖర్చులు, జీవన సౌకర్యాలు సాపేక్షంగా ఎక్కువ. ఇది వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా ఉండటం వల్ల ఖర్చులు పెరుగుతాయి.

**హైదరాబాద్**

ఐటీ, ఫార్మా రంగాలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో జీవన వ్యయం ఇటీవలి సంవత్సరాల్లో పెరిగింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో అద్దెలు, జీవన ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి.

**పూణే**

విద్యా, ఐటీ, మరియు తయారీ రంగాలకు కేంద్రంగా ఉన్న పూణేలో జీవన వ్యయం క్రమంగా పెరుగుతోంది. ఇక్కడ అద్దెలు, రవాణా, జీవనశైలి ఖర్చులు గణనీయంగా ఉంటాయి.

**కోల్‌కతా**

తూర్పు భారతదేశంలోని ప్రధాన నగరమైన కోల్‌కతాలో జీవన వ్యయం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే కొంత తక్కువ అయినప్పటికీ, ఇటీవలి అభివృద్ధి వల్ల ఖర్చులు పెరుగుతున్నాయి.

**విశ్లేషణ ఇలా..**

ఆర్థిక రాజధాని ముంబై, దేశ రాజధాని న్యూ ఢిల్లీ సాధారణంగా అగ్రస్థానంలో ఉంటాయి, ఎందుకంటే ఇవి ఆర్థిక, రాజకీయ కేంద్రాలు మరియు జనాభా సాంద్రత ఎక్కువ. బెంగళూరు మరియు హైదరాబాద్ వంటి ఐటీ నగరాలు ఉద్యోగ అవకాశాలు మరియు ఆధునిక జీవనశైలి వల్ల ఖరీదైనవిగా మారాయి. ఈ నగరాల్లో జీవన వ్యయం ప్రాంతం, జీవనశైలి, మరియు వ్యక్తిగత ఎంపికలపై ఆధారపడి మారవచ్చు.

# తెలంగాణలో ఎన్డీయే... ఎంట్రీ...

**హైదరాబాద్, మార్చి 24, పెన్ పవర్:**
పాత నినాదాన్ని తెరపైకి తీసుకొస్తున్నారా? మళ్లీ చంద్రబాబు పేరు ప్రస్తావించడం దేనికి సంకేతం? తెలంగాణలో ఎన్డీఏ కూటమి బలపడుతుందని ఆయన భావిస్తున్నారా? ఏపీలో చంద్రబాబు గెలుపునకు కూటమి కారణమని ఆయన ఎందుకు అన్నారు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఏదైనా వ్యూహం లేకుండా కెసిఆర్ అలా మాట్లాడరు. పైగా తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయడం లేదు. అటువంటి చంద్రబాబు ప్రస్తావన కెసిఆర్ తీసుకొచ్చారంటే తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానం మాత్రం ఉంది. తాను ఒంటరిగా అధికారంలోకి వస్తానని చెప్పారు. అదే సమయంలో చంద్రబాబు కూటమి కట్టడం ద్వారా అధికారంలోకి వచ్చారని చెప్పారు. దీని వెనకే అసలు అనుమానం కలుగుతోంది.కెసిఆర్ పదేపదే చంద్రబాబు ప్రస్తావన ఎందుకు తీసుకొస్తున్నారు అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. తెలంగాణలో చంద్రబాబు రాజకీయాలు చేయడం లేదు. కనీసం తన పార్టీ అధ్యక్షుడిని కూడా నియమించలేదు. మరి ఎందుకు కేసీఆర్ చంద్రబాబు జపం చేస్తున్నారు? ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న కూడా ఇదే. అయితే కెసిఆర్ లో ఒక భయం కనిపిస్తోంది. తెలంగాణలోనూ ఎన్డీఏ యాక్టివ్ అవుతుందన్న ఆందోళన ఆయనలో ఉంది. ఏపీలో కూటమి ప్రస్తావన తీసుకొచ్చారు అంటే.. రేపు తెలంగాణలో అదే కూటమి వస్తే తన పరిస్థితి ఏంటనేది ఆయన ఆందోళనగా తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణలో ఎన్డీఏ కూటమి ఏర్పడుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ కూటమిలోకి కెసిఆర్ ఎంట్రీ ఉండదు. దానికి కారణం చంద్రబాబు. అందుకే ఆయన ఒక గట్టు కట్టుకుంటున్నారు. ముందుగానే కారణాలను అన్వేషిస్తున్నారు.
కెసిఆర్ ది ఉద్యమ పార్టీ. తెలంగాణఉద్యమం ఆ పార్టీకి రక్షణ కవచంలా పనిచేసింది. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల మద్దతు ఆ పార్టీకి ఉండేది. అయితే స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత.. కెసిఆర్ పాలన చూసిన తర్వాత తెలంగాణ ఓటర్ల ప్రాధాన్యతలు మారిపోయాయి. ఫలితంగా బిఆర్ఎస్ ఓటు బ్యాంకు తగ్గిపోతూ వచ్చింది. చివరకు పార్లమెంట్ ఎన్నికల నాటికి అది డిపాజిట్లు కోల్పోయే పరిస్థితికి చేరింది. బలంగా ఉన్నారనుకున్న ఉత్తర తెలంగాణలో దారుణ పరిస్థితి ఎదురయింది. బలంగా లేని దక్షిణ తెలంగాణలో పరిస్థితి మరింత దిగజారుతోంది. ఇలాంటి సమయంలో ఎన్డీఏ కూటమి ఏర్పడితే మాత్రం ఆ రెండు ప్రాంతాల్లో పట్టు సాధించడం ఖాయం. కెసిఆర్ లో కూడా అదే భయం కనిపిస్తోంది. దానిని గుర్తించి కెసిఆర్ చంద్రబాబు పేరు పదేపదే ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది.
తాను ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వస్తానని కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీని అలెర్ట్ చేశారు. ఏపీలో ఎన్డీఏ కూటమి సక్సెస్ అయింది. తెలంగాణలోకి ఎంట్రీ ఇస్తే కాంగ్రెస్ పార్టీతో జత కలిసేందుకు చంద్రబాబు హింట్ ఇచ్చినట్లు అయింది. ఇప్పటికే చెన్నై వేదికగా డీ లిమిటేషన్ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీతో పాలుపంచుకున్నారు కేటీఆర్. తద్వారా వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీని ఒక ఆప్షన్ గా ఎంచుకున్నారు. సో ఆడవారి మాటలకు అర్థాలు వేరులే అన్నట్టు.. కెసిఆర్ చంద్రబాబుపై కామెంట్స్ కూడా అలానే ఉన్నాయి.

# పోసాని తర్వాత విడదల రజనీ...?



**గుంటూరు, మార్చి 24, పెన్ పవర్:** మాజీ మంత్రి విడదల రజనీపై ఏసీబీ కేసు నమోదయింది. ఆమెను త్వరలోనే అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని తెలిసింది. ఏసీబీ కేసులో విడదల రజనీతో పాటు మరికొందరిపై కూడా కేసులు నమోదయ్యాయి. విజిలెన్స్ అధికారులను పంపించి బెదిరించి యడ్లపాడులోని స్టోన్ క్రషర్ నుంచి 2.20 కోట్ల రూపాయలు విడదల రజనీ బ్యాచ్ వసూలు చేసిందని ఏసీబీ ఆరోపిస్తుంది. రజనీతో పాటు ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతా? పాటు మరికొందరిపైన కూడా కేసులు నమోదు చేశారు. అనేక సెక్షన్లకింద నమోదయిన ఈకేసుల్లో ఏ2 నిందితురాలిగా విడదల రజనీ ఉన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇచ్చిననివేదిక ను ఆధారంగా చేసుకుని కేసు నమోదయింది. ఎక్కేది ఎప్పుడంటే? 2.20 కోట్లు తీసుకుని... 2020లో ఈ ఘటన జరిగిందని అధికారులు చెబుతున్నారు. స్టోన్ క్రషర్ ను క్లోజ్ చేయకుండా ఉండాలంటే తమకు 2.20 కోట్ల రూపాయలు చెల్లించాలని బెదిరించడంతో దాని యజమానులు చలపతిరావు, నంబూరి శ్రీనివాసరావులు రజనీని కలిసి చర్చించారు. తర్వాత రజనీ అనుచరులకు ఆ డబ్బులు చెల్లించినట్లు ఆధారాలున్నాయని ఏసీబీ అధికారులు తెలిపారు. డబ్బులు ఇవ్వడం ఆలస్యమయిందని భావించి, ఆగ్రహించి రజనీ విజిలెన్స్ అధికారుల చేత స్టోన్ క్రషర్ పై దాడులు కూడా నిర్వహించి దాని యజమానులను భయభ్రాంతులకు గురి చేసినట్లు కూడా ఫిర్యాదు అందింది. ఎవరి అనుమతి లేకుండానే విచారణ చేసిన అప్పటి ఐపీఎస్ అధికారి పల్లె జాషువాను కూడా ఈకేసులో నిందితులుగా చేర్చారు.స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి యాభై కోట్ల రూపాయలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్ ను నిర్వహిస్తున్నారని విజిలెన్స్ అధికారుల బెదిరింపులకు దిగారన్నఆరోపణలున్నాయి. దీంతో భయపడిన స్టోన్ క్రషర్ యజమానులు రజనీని కలసి తమకు జరిమానా పడకుండా సాయంచేయాలని కోరగా, అందుకు ప్రతిగా 2.20 కోట్ల రూపాయలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఇప్పుడు ఏసీబీ కేసు నమోదు చేసింది. విడుదల రజినీతో పాటు అప్పటి గుంటూరు ఆర్వీఈవో, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆరోపణలు రాగా తొలుత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఆ విభాగానికి చెందిన డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఆ నివేదిక సిఫార్స్ మేరకు ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులు ఇందుకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేశారు.లంచం తీసుకోవడం, అనుచిత లబ్ధి కలిగించడం, నేరపూరిత కుట్ర, బెదిరింపు తదితర అభియోగాలపై అవినీతి నిరోధక చట్టంలోని 7, 7ఏ, ఐపీసీలోని 384, 120బీ సెక్షన్ల మీద కేసు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో ఏ1గా విడదల రజిని, ఏ2గా ఐపీఎస్ అధికారి పల్లె జాషువా, ఏ3గా విడదల రజిని మరిది అయిన విడదల గోపి, ఏ4గా రజిని పీఏ దొడ్డ రామకృష్ణలను నిందితులుగా చేర్చింది. బెదిరింపులు, అక్రమ వసూళ్ల పై తొలుత విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్స్ కు ఫిర్యాదు అందగా.. ఆ విభాగం డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా విచారణ జరిపించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ ప్రాథమిక దర్యాప్తు చేశారు. ఆధారాలు లభించడంతో కేసు నమోదు చేశారు.కేసు విషయానికి వస్తే.. '2020 సెప్టెంబరు 4న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక గ్రామంలోని శ్రీ లక్ష్మి బాలాజీ స్టోన్ క్రషర్ కండ్రికను అప్పటి చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని పీఏ దొడ్డ రామకృష్ణ సందర్శించారు. స్టోన్‌క్రషర్‌పై దాడులు చేయకుండా, స్టోన్ క్రషర్ ను మూయించకుండా ఉండాలంటే రజినిని కలవాలని ఆదేశించారు. దీంతో దాని యజమానులు నల్లపనేని చలపతిరావు, నంబూరి శ్రీనివాసరావు రజిని ఆఫీసుకు వెళ్లి కలిశారు. వ్యాపారం సజావుగా జరగాలంటే అడిగినంత డబ్బులివ్వాల్సిందేనని, మిగతా విషయాలన్నీ తన పీఏ రామకృష్ణతో మాట్లాడాలని రజిని వారికి హుకుం జారీ చేశారు. వారిద్దరూ రామకృష్ణను కలవగా ఆయన రూ.5కోట్లు డిమాండ్ చేశారు. ఆ తర్వాత వారం రోజులకే సెప్టెంబర్ 10న అప్పటి గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌వీఈవో)గా ఉన్న ఐపీఎస్ అధికారి పల్లె జాషువా తన బృందంతో శ్రీ లక్ష్మిబాలాజీ స్టోన్‌క్రషర్‌లో తనిఖీలకు వెళ్లారు. ఆ స్టోన్ క్రషర్‌పై ఎవరూ ఫిర్యాదు చేయకుండానే హడావుడి చేశారు. అప్పటి విజిలెన్స్ డీజీ అనుమతి కూడా తీసుకోలేదు. విజిలెన్స్ మెయిన్ ఆఫీసుకు ఈ తనిఖీల గురించి సమాచారమే ఇవ్వలేదు. విచారణలో వెల్లడైన అంశాలతో నివేదిక రెడీ చేశారు.జాషువా ఆదేశాలతోనే తామంతా తనిఖీల్లో పాల్గొన్నామని మిగతా అధికారులను ఏసీబీకి తెలిపారు. ఎఫ్ఐఆర్ లో కూడా విడదల రజనీ ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో విడదల రజనీ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లే కనపడుతుంది. పోసాని బెయిల్ పై బయటకు రావడంతో తర్వాత ఇక జైలుకు వెళ్లేది విడదల రజనీ అంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్ లు కనపడుతున్నాయి.

### భయపడను...లొంగను

తనపై నమోదయిన కేసులపై మాజీ మంత్రి విడదల రజనీ స్పందించారు. తనపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. బీసీ మహిళ రాజకీయంగా ఎదిగితే కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతుందన్నారు. తనపై నమోదయిన కేసులన్నీ అక్రమ కేసులేనని, రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే కేసులు నమోదు చేశారని విడదల రజని అన్నారు. అక్రమ కేసులకు తాను భయపడనని, న్యాయపోరాటం చేస్తానని విడదల రజనీ తెలిపారు. ఆధారాలు లేకుండా తనపై కేసులు నమోదు చేశారంటూ విడదల రజనీ ధ్వజమెత్తారు. కేసులకు భయపడి తాను రాజకీయంగా లొంగిపోనని తెలిపారు. తాను వైసీపీలోనే ఉంటూ పోరాటం సాగిస్తానని విడదల రజనీ స్పష్టం చేశారు. తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని విడదల రజనీ అన్నారు.

# జగన్ దారి ఎటూ...



**కాకినాడ, మార్చి 24, పెన్ పవర్:** వైఎస్ జగన్ రాజకీయంగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏపీలో తన పార్టీ పరిస్థితి మాత్రమే కాదు. జాతీయ స్థాయిలో ఎలాంటి రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలన్న దానిపై ఆయనకు స్పష్టత లేకుండా పోయింది. ఓ వైపు ఎన్డీఏ కూటమి కాదనేసింది. ఇండియా కూటమి రమ్మంటోంది. కానీ ?యన మాత్రం ధైర్యం చేయలేకపోతున్నారు.దక్షిణాదికి నియోజకవర్గాల పునర్విభజన విషయంలో అన్యాయం జరుగుతోందన్న వాదనతో నిర్వహించిన సమావేశానికి డీఎంకే నుంచి ప్రతినిధులు వచ్చి జగన్ ను కలిశారు. అప్పట్లో వారికి వస్తామా లేదా అన్న సమాచారం ఏమీ చెప్పలేదు. చివరికి వెళ్లలేదు. అయితే సన్నిహిత పార్టీగా గుర్తింపు ఉన్న బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ సమావేశంలో పాల్గొంది. కేటీఆర్ హాజరయ్యారు. కానీ జగన్ మాత్రం వెళ్లలేదు. స్టాలిన్ తో జగన్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. 2019లో జగన్ ప్రమాణ స్వీకారానికి వచ్చిన ఇద్దరు ముఖ్యమంత్రుల్లో ఒకరు . అయినా స్టాలిన్ పిలుపునకు జగన్ స్పందించలేదు. కొద్ది నెలల కిందట జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేస్తే .. ఆయనకు మద్దతు ఇవ్వడానికి ఇండియా కూటమిలోని పార్టీల నేతలందరూ వచ్చారు. టీడీపీపై విమర్శలు చేశారు. కానీ జగన్ మాత్రం ఇండియా కూటమికి ఏ విషయంలోనూ మద్దతు ప్రకటించడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. గతంలో పార్లమెంట్ లో ఏ విషయంలోనూ కాంగ్రెస్ కూటమిని సమర్థించలేదు సరి కదా ఇప్పుడు స్టాలిన్‌తో భేటీకి కూడా దూరంగా ఉన్నారు. దక్షిణాదికి అన్యాయం జరుగుతుందా లేదా అన్న అభిప్రాయాన్ని చెప్పడానికి కూడా భయపడుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఢిల్లీలో స్టాలిన్ సమావేశం జరుగుతున్న సమయంలో జగన్ ప్రధానికి ఓ లేఖ రాశారని వైసీపీ వర్గాలు మీడియాకు సమాచారం ఇచ్చాయి. వచ్చే ఏడాది (2026) జరగబోయే డీలిమిటేషన్ ప్రక్రియలో ఆయా రాష్ట్రాల సీట్ల విషయంలో అన్యాయం జరగకుండా చూడాలి. ప్రస్తుతం ఉన్న జనాభా లెక్కల ప్రకారం డీలిమినేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం కచ్చితంగా తగ్గుతుంది. అందుకే జనాభా లెక్కల ప్రకారం ఈ డీలిమిటేషన్ లేకుండా చూడండి అని లేఖలో మోదీని కోరారు. సమావేశానికి వెళ్లకుండా.. బీజేపీని సంతృప్తి పరిచిన ఆయన మోదీకి లేఖ రాసి.. ఆ సమాచారాన్ని స్టాలిన్ కు పంపి.. వారినీ సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు. జగన్ తమ వైపే ఉన్నారని కనిమొళి కూడా ప్రకటించారు. అయితే రాజకీయాల్లో ఇలా రెండు పడవలపై చేసే ప్రయాణం మనకకే దారి తీస్తుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. జగన్ ఏదో ఓ కూటమి వైపు మొగ్గితే మంచిదని అంటున్నారు. ఎన్డీఏతో కలిసే అవకాశాలే ఉండనప్పుడు బీజేపీ చల్లని చూపుల కోసం ప్రయత్నించడం రాజకీయంగా నష్టం జరుగుతుందని అంటున్నారు.

# రుషికొండ బీచ్‌కు 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు

**విశాఖపట్టణం, మార్చి 24, పెన్ పవర్:** రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపును పునరుద్ధరించారు. ఇటీవల విధించిన తాత్కాలిక ఉపసంహరణ ఆదేశాలను ఎత్తివేస్తున్నట్లు.. బ్లూ ఫ్లాగ్ ఇండియా అధికారులు ప్రకటించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు బ్లూ ఫ్లాగ్‌ను జ్యూరీ సభ్యులు అందించారు. దీనిపై విశాఖ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..విశాఖపట్నంలోని రుషికొండ బీచ్‌కు 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపును ఇటీవల ఉపసంహరించారు. బీచ్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, బట్టలు మార్చుకునే గదుల దగ్గర శుభ్రత లోపించడం, నడక దారి ధ్వంసం అవ్వడం, రుషికొండ బీచ్‌లోకి శునకాలు రావడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, పార్కింగ్ సదుపాయాన్ని దుర్వినియోగం చేయడం, మౌలిక వసతులు కొరవడడం వంటి కారణాలతో ఉపసంహరించారు..బ్లూ ఫ్లాగ్ అనేది బీచ్‌లకు ఇచ్చే ఒక అంతర్జాతీయ పర్యావరణ గుర్తింపు. ఈ గుర్తింపు పొందిన బీచ్‌లు పర్యాటకులను ఆకర్షిస్తాయి. రుషికొండ బీచ్‌కు 2020లో బ్లూ ఫ్లాగ్ గుర్తింపు లభించింది.బ్లూ ఫ్లాగ్ గుర్తింపును పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా యంత్రాంగం బ్లూ ఫ్లాగ్ కమిటీకి లేఖ రాసి పరిశీలనకు రావాలని, గుర్తింపును పునరుద్ధరించాలని కోరింది. బ్లూ ఫ్లాగ్ బృందం రుషికొండ బీచ్‌ని పరిశీలించింది. రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపును పునరుద్ధరిస్తున్నట్టు.. బ్లూఫ్లాగ్ ఇండియా నేషనల్ ఆపరేటర్ డాక్టర్ శ్రీజిత్ కురూప్ వెల్లడించారు.రుషికొండ బీచ్ విశాఖపట్నం నగరంలోని ఒక అందమైన బీచ్. దీనిని "తూర్పు తీరపు రత్నం" అని కూడా పిలుస్తారు. ఈ బీచ్‌కు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ బీచ్ బంగారు ఇసుక, స్పష్టమైన నీలిరంగు నీటితో చాలా అందంగా ఉంటుంది. చుట్టూ కొండలు, పచ్చని ప్రకృతి దృశ్యాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి.రుషికొండ బీచ్‌లో స్కూబా డైవింగ్, సర్ఫింగ్, వాటర్ స్కీయింగ్, కయాకింగ్ వంటి అనేక నీటి క్రీడలు అందుబాటులో ఉన్నాయి. ఇతర బీచ్‌లతో పోలిస్తే, రుషికొండ బీచ్ ప్రశాంతంగా ఉంటుంది. ఇది విశ్రాంతి తీసుకోవడానికి, ప్రకృతిని ఆస్వాదించడానికి అనువైన ప్రదేశంరుషికొండ బీచ్ ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తుంది. రుషికొండ బీచ్‌కు 2020 సంవత్సరంలో బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ లభించింది. ఆ తర్వాత పర్యాటకుల తాకిడి మరింత పెరిగింది.



దీని అభివృద్ధికి గత, ప్రస్తుత ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకున్నాయి..బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన బీచ్‌లు పర్యావరణపరంగా స్థిరమైనవిగా పరిగణించబడతాయి. తద్వారా పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తాయి. బ్లూ ఫ్లాగ్ అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అవార్డు. ఇది బీచ్‌ల ప్రతిష్టను పెంచుతుంది.

## కొరకురాని కొయ్యిగా కొలికపూడి

**విజయవాడ, మార్చి 24, పెన్ పవర్:** నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంటారు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కాకముందే వంద ఆరోపణలు ఆయన ఎదుర్కొన్నారు. అది కూడా ప్రత్యర్థుల నుంచి కాదు. సొంత పార్టీ నేతలు, కూటమి పార్టీల నాయకుల నుంచి ఆయన ఆరోపణలు ఎదుర్కొనడం టీడీపీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది. ఇప్పటికే పలు మార్లు పంచాయతీ కొలికిపూడి వివాదాలపై చేయడం, క్రమశిక్షణ కమిటీ ముందు హాజరు కావడం వంటివి జరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు మార్లు హెచ్చరించినా కొలికపూడి శ్రీనివాసరావు వైఖరిలో మార్పు రావడం లేదు. వరస వివాదాల్లో చిక్కుకోవడంతో పాటు తానే నియోజకవర్గంలో మోనార్క్ లాగా వ్యవహరిస్తుండటంతో పార్టీ పెద్దలు కూడా ఏమీ చేయలేక, చర్యలు తీసుకోలేక చేతులెత్తేస్తున్నట్లే కనపడుతుంది. చాలా రోజుల తర్వాత తిరువూరు నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించింది. అయితే ఆ విజయం సాధించామన్న ఆనందం మాత్రం పార్టీ నేతలు, శ్రేణుల్లో కొలికపూడి శ్రీనివాసరావు మిగల్చడం లేదు. ఎన్నికయిన నాటి నుంచి ప్రతిదీ వివాదమే. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆయన పోస్ట్ చేస్తున్న వీడియోలు కూడా వైరల్ గా మారడంతో పార్టీ పెద్దలు అక్షింతలు వేశారు. బెల్ట్ షాపులంటూ దాడులు ఎమ్మెల్యే కొలికపూడి స్వయంగా నిర్వహించడంతో పాటు రహదారులపై కూర్చుని నిరసన వ్యక్తం చేయడం వంటి వాటిపై పార్టీ నాయకత్వం విచారణకు ఆదేశించింది. అదే సమయంలో ఒక దళిత మహిళను అవమానించారంటూ ఆమె ఆత్మహత్యాయత్నం చేయబోవడంతో అది కాస్తా పార్టీకి ఇబ్బందికరంగా మారింది. తిరువూరు నుంచి టీడీపీలోని ఒక వర్గం వచ్చి నేరుగా చంద్రబాబు నాయుడును కలిసి కొలికపూడి శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేయడం కూడా జరిగింది. అప్పుడే చంద్రబాబు నాయుడు కొలికపూడిని హెచ్చరించారు. అమరావతి రాజధాని కోసం జరిగిన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారన్న ఏకైక కారణంతోనే పార్టీ నేతలను పక్కన పెట్టి కొలికపూడి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే గెలిచిన తర్వాత తమకు ఇబ్బందిగా మారారంటున్నారు టీడీపీ నేతలు. కొలికపూడి తన వైఖరిని మార్చుకోకపోతే పార్టీ నియోజకవర్గంలో తీవ్రంగా నష్ట పోతుందని కూడా వారు చెబుతున్నారు తాజాగా జనసేన పార్టీకి చెందిన తిరువూరు నేత ఒకరు కొలికపూడి శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. తనను చంపేందుకు కొలికపూడి సుపారీ ఇచ్చారని కూడా జనసేన నేత ఆరోపణలు చేయడంతో పాటు కొలికపూడి శ్రీనివాసరావు అనేక అవినీతి పనులకు పాల్పడుతున్నారని, అనేక మంది నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించడం ఇప్పుడు కూటమికి ఇబ్బందికరంగా మారింది. స్థానిక టీడీపీ నాయకత్వంతో పడకపోవడం, కూటమి నేతలను కొలికపూడి కలుపుకుని పోకుండా తనకు ఇష్టమున్న వాళ్లకే పదవులు కట్టబెడుతుండటం వంటి కారణాలతోనే ఆయన వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారని తెలిసింది. ఇప్పటికైనా కొలికపూడి శ్రీనివాసరావు తన వైఖరి మార్చుకోకుంటే తిరువూరులో పార్టీ మరింత ఇబ్బదుల్లో పడే అవకాశముందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

## ఇక నో బ్యాగ్ డే

**విజయవాడ, మార్చి 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పుస్తకాల మోతకు స్వస్తి పలికేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు ప్రస్తుతం ప్రతి నెల మూడో శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తుండగా... ఇకపై దీనిని ప్రతి శనివారం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి శనివారం నో బ్యాగ్ డేను అమలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా వెల్లడించారుప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందులో భాగంగానే 'నో బ్యాగ్ డే' అమలు చేస్తోంది. ఆ రోజు విద్యార్థులకు క్విజ్లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, క్రీడలు, వివిధ పోటీలు నిర్వహిస్తామని లోకేశ్ తెలిపారు. నో బ్యాగ్ డే వల్ల విద్యార్థులకు కలుగుతున్న ప్రయోనాలపై వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలిపిన విశేషాలతో కూడిన వీడియోను లోకేశ్ షేర్ చేశారు. అయితే ఈ నిర్ణయాన్ని పలువురు నెటిజన్లు సైతం అభినందిస్తున్నారు. ఇదిలాఉండగా.. ప్రస్తుతం నెలలో మూడో శనివారం నో బ్యాగ్ డేగా అమలు చేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల అది సరిగా అమలు కావడం లేదనే విమర్శ ఉంది. ఈ ఏడాది జనవరిలో మంత్రి నారా లోకేష్ పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యపై జరిగిన సమీక్షలో పాఠశాలల్లో ప్రతి శనివారం నో బ్యాగ్ డే అమలు చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల కోసం కో కరిక్యులమ్ రూపొందించాలని కూడా మంత్రి నారా లోకేష్ అధికారులను కోరారు.విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడం, బడి అంటే భయాన్ని పోగొట్టడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న మంత్రి నారా లోకేష్ జనవరి నెలలో కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ప్రతి శనివారం నో బ్యాగ్ డే గా ప్రకటించి విద్యార్థులకు కో కరిక్యులం యాక్టివిటీస్ రూపొందించాలని సంబంధిత విద్యాశాఖ అధికారులను మంత్రి అప్పుడు ఆదేశించారు. ఈ ఆదేశాలు అమలైతే ప్రతి శనివారం విద్యార్థులు పాఠశాలకు పుస్తకాల బరువులతో వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉన్నత పాఠశాల స్థాయి చదువుల కోసం విద్యార్థులు పుస్తకాల రూపంలో అధిక బరువులను మోస్తున్న పరిస్థితి. వారంలో ఆరు రోజులు విద్యార్థులకు ఏకధాటిగా తరగతులు నిర్వహిస్తారు. ఆదివారం రోజు సెలవు దినం కావడంతో, ఆరోజున విద్యార్థులు తమకు అప్పగించిన హోంవర్క్ పూర్తి చేసే పనిలో ఉంటారని చెప్పవచ్చు. అలాగే తమకు దొరికిన కొద్ది సమయంలో ఆటపాటలకు సమయాన్ని కేటాయిస్తారు. ఇటువంటి పరిస్థితులను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.

## దండు మారెమ్మ జాతరలో అశ్లీలం.. బూతు.. బూతు

**తిరుపతి, మార్చి 24, పెన్ పవర్:** ఏదైనా పండుగలు, జాతరలు, తిరునాళ్లు సమయంలో పల్లెల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో సాంస్కృతిక కార్యక్రమాలు పేరుతో గ్రామాల్లో రికార్డింగ్ డాన్స్‌లు నిర్వించేవారు. కొన్ని సార్లు డాన్స్ బేబీ డాన్స్‌తో అశ్లీల నృత్యాలు నిర్వహించేవాళ్లు. రాను రాను వీటిపై నిషేదించారు. చాలా ఏళ్ల నుంచి నిషేదం ఉన్నప్పటికీ.. గత కొంత కాలంగా రికార్డింగ్ డాన్సులు, అశ్లీల నృత్యాలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది.ముఖ్యంగా ఈ మధ్య కాలంలో యువత చెడు వ్యసనాలకు బానిసవడంతో.. ఇలాంటి డాన్సులుపై నిషేదం విధించారు. అయినా సరే కొన్ని గ్రామాల్లో జాతరలు, పండుగల సమయంలో సాంస్కృతిక కార్యకాలాపాలు పేరిట అశ్లీల నృత్యాలు చేస్తూ వస్తున్నారు. ఇలాంటి కార్యాక్రమాలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు ఇలాంటి ప్రోగ్రామ్‌లను అడ్డుకున్నప్పటికీ.. మరికొన్ని చోట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తూ విమర్శలు పాలవుతున్నారు.ఇదిలా ఉంటే.. తాజాగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లో నిర్వహిస్తున్న దండు మారెమ్మ జాతర అభాసుపాలైంది. జాతరలో నిర్వహించకూడని డ్యాన్స్‌లను హిజ్రాల చేత యాథేచ్ఛగా చేయించారు జాతర నిర్వహకులు. అశ్లీల నృత్యాలతో పాటుగా జుగుప్సాకరంగా ఎలాంటి బట్టలు లేకుండా శరీర భాగాలు కనిపించే విధంగా డ్యాన్స్ లు చేశారు కొంతమంది హిజ్రాలు.ఈ వ్యవహారమంతా స్థానిక ముదివేడు పోలీస్ స్టేషన్ పోలీసులు గమనిస్తున్నా ఆ డ్యాన్స్ లను అడ్డుకునే ప్రయత్నం ఏ మాత్రం చేయలేదు. ఆ సమయంలో అక్కడే డ్యూటీలు చేస్తున్న ఇద్దరు ఎస్ఐలు తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరించారని స్థానికులు తెలిపారు. ఆ నృత్యాలను సీఐ గాని సంబంధిత ఎఐ గాని ఎందుకు ఆపలేదని ? ప్రజలు విమర్శిస్తున్నారు. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న విజువల్స్ చూస్తే పోలీసులే అశ్లీల డ్యాన్స్ లను ప్రోత్సహించారని, వారి సహాకారం ఉండటం వల్లే జాతర నిర్వహకులు ఈ తరహా డ్యాన్స్ లను నడిపిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు.దండు మారెమ్మ జాతర చిత్తూరు పడమటి మండలాల్లో ప్రేత్యేక గుర్తింపు పొందిన వేడుక. అయితే ఈ సారి ఆచారం పేరుతో అర్ధరాత్రి టైమ్‌లో అసభ్యకరమైన డాన్స్‌లు చేయడం, వేడుకను విచ్చలవిడిగా మార్చేయడం అందరిని షాంకింగ్‌కు గురిచేసింది. సభ్య సమాజం తలదించుకునే విధంగా ట్రాక్టర్‌పై నగ్న దృశ్యాలతో డ్యాన్సులు చేయడం అత్యంత దారుణంగా ఉన్నాయి.ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఈ తరహా డ్యాన్స్ లు జిల్లాలో ఏ జాతరలో కూడా మరలా రీపీట్ కాకుండా చూడాలంటున్నారు ప్రజలు. దండు మారెమ్మ జాతర నిర్వహకులపై, డ్యూటీలో ఉన్న ఎస్ఐ లపై జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గైక్వాడ్, ఖలీల్‌పై బాల్ టాంపరింగ్ ఆరోపణలు..
# బ్యాన్ చేయాలని ఫ్యాన్స్ డిమాండ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** చెపాక్ వేదికగా ఆదివారం (మార్చి 23) ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడిన సంగతి తెలిసిందే. సొంతగడ్డపై అద్భుతంగా ఆడిన చెన్నై సునాయాస విజయాన్ని అందుకుంది. దీంతో ఎప్పటిలాగే ముంబై తమ టోర్నీ ప్రారంభ మ్యాచ్ ఓడిపోగా.. చెన్నై గెలుపుతో సీజన్ స్టార్ట్ చేసింది. ఈ మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఇద్దరు క్రికెటర్లపై బాల్ టాంపరింగ్ ఆరోపణలు రావడం సంచలనంగా మారింది. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్.. ఫాస్ట్ బౌలర్ ఖలీల్ అహ్మద్ కలిసి బాల్ టాంపరింగ్ చేశారని కొంతమంది అభిమానులు భావిస్తున్నారు. ఈ బ్లాక్ బస్టర్ సమరంలో ముంబై టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగింది. తొలి ఓవర్ ఖలీల్ అహ్మద్ బౌలింగ్ స్టార్ట్ చేయడానికి ముందు కెప్టెన్ గైక్వాడ్.. ఖలీల్ దగ్గరకు వచ్చి ఏదో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో ఖలీల్ వెనక్కి తిరిగి జేబులో ఏదో తీస్తున్నట్టు.. గైక్వాడ్ కూడా అతని దగ్గర నుంచి ఏదో తీసుకున్నట్టు తెలుస్తుంది. అయితే వీడియోలో ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ఈ విషయం గురించి పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. అయితే కొంతమంది మాత్రం వీరిద్దరూ బాల్ టాంపరింగ్ చేశారని గట్టిగా ఆరోపిస్తున్నారు. అంతేకాదు కొంతమంది వీరిని బ్యాన్ చేయాలంటూ డిమాండ్ చేయడం సంచలనంగా మారింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్ మాత్రం బాల్ టాంపరింగ్ ఆరోపణలో నిజం లేదని.. గైక్వాడ్ కొత్త బంతిని ఖలీల్ కు ఇవ్వడానికి వచ్చాడని చెబుతున్నారు. ఖలీల్ తన చేతికున్న ఉంగరాన్ని గైక్వాడ్ కు ఇచ్చాడని.. అతను తన జేబులో వేసుకున్నాడని చెబుతున్నారు. చెన్నై అంటే నచ్చని కొంతమంది తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని సూపర్ కింగ్స్ ఫ్యాన్స్ అంటున్నారు. ఈ మ్యాచ్ లో ఖలీల్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఇందులో కీలకమైన రోహిత్ శర్మ వికెట్ కూడా ఉంది. 2016, 2017లో జట్టు యజమాని స్పాట్ ఫిక్సింగ్ కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల చెన్నై సూపర్ కింగ్స్ జట్టును బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే. చెన్నై వేదికగా చెపాక్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ గెలిచి టోర్నీలో బోణీ కొట్టింది. బౌలర్లు సమిష్టిగా రాణించడంతో పాటు.. ఓపెనర్ రచీన్ రవీంద్ర( 45 బంతుల్లో 65:2 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ గైక్వాడ్ (53) హాఫ్ సెంచరీలతో చెన్నై 4 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్ష్య ఛేదనలో చెన్నై 19.1 ఓవర్లలో 6 వికెట్లను 158 పరుగులు చేసి గెలిచింది.

# ఐపీఎల్‌లో మిస్సింగ్.. పాకిస్థాన్‌లో రూలింగ్: కరాచీ కింగ్స్ కెప్టెన్‌గా సన్ రైజర్స్ మాజీ స్టార్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా మాజీ స్టార్ ప్లేయర్ డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కొంత ఒడిదుడుకులను ఎదుర్కోనున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడతానని చెప్పినా అతన్ని పరిగణలోకి తీసుకోలేదు. ఆ తర్వాత ఐపీఎల్ లోనూ వార్నర్ కు నిరాశే ఎదురైంది. రూ.2 కోట్ల రూపాయలతో 2025 మెగా ఆక్షన్ లోకి వచ్చిన ఈ విధ్వంసకర ఓపెనర్ ను ఎవరూ కొనలేదు. దీంతో వార్నర్ శకం ముగిసిందనున్నారు. అయితే ఆస్ట్రేలియాలోని బిగ్ బాష్ లీగ్ లో అదరగొట్టాడు. సిడ్నీ థండర్ జట్టు తరపున అద్భుతంగా ఆడి పాకిస్థాన్ సూపర్ లీగ్ కు సెలక్ట్ అయ్యాడు. ఐపీఎల్ లో అమ్ముడుపోని వార్నర్.. పాకిస్థాన్ సూపర్ లీగ్ లో భారీ ధరకు కొనుగోలు చేయడం విశేషం. 2025 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో ప్లాటినం డ్రాఫ్ట్‌లో 44 మంది ఆటగాళ్లలో వార్నర్ కూడా ఉన్నాడు. దీంతో ఈ ఆసీస్ మాజీ ఓపెనర్ తొలిసారి పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. అంతేకాదు 2025 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో కరాచీ కింగ్స్ కు వార్నర్ కెప్టెన్ గా ఎంపికయ్యాడు. సోమవారం (మార్చి 24) కరాచీ కింగ్స్ జట్టుకు వార్నర్ కెప్టెన్ అని ఆ జట్టు ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. 2024 సీజన్ లో కరాచీ కింగ్స్ ను నడిపించిన షాన్ మసూద్ ను పక్కన పెట్టి వార్నర్ కు సారధ్య బాధ్యతలు అప్పగించడం విశేషం. గత సీజన్ లో కెప్టెన్ షాన్ మసూద్ చేసిన కృషికి జట్టు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. 2024 టీ20 వరల్డ్ కప్ లో భారత్ తో ఆసీస్ మ్యాచ్ ఓడిపోవడంతో వార్నర్ అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. జనవరి 6, 2024 న టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన వార్నర్.. వన్డేలకు గుడ్ బై చెప్పారు. వార్నర్ కు ఐపీఎల్ లో అద్భుతమైన రికార్డ్ ఉంది. రెండు సార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకోవడంతో పాటు 2016 లో సన్ రైజర్స్ హైదరాబాద్ కు టైటిల్ అందించాడు. ఐపీఎల్ లో ఈ సారి నిరాశే మిగిలినా అతనికి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో కెప్టెన్సీ ఆఫర్ రావడం ఊరట కలిగిస్తుంది. పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025 పదో ఎడిషన్ షెడ్యూల్ వచ్చేసింది. ఏప్రిల్ 11న ప్రారంభం కానున్న ఈ టోర్నీ మే 18 న ఫైనల్ తో ముగుస్తుంది. తొలిసారి పాకిస్థాన్ సూపర్ లీగ్ ఐపీఎల్ తో పోటీ పడనుంది. ఐపీఎల్ మార్చి 22 నుంచి మే 25 వరకు జరుగుతుంది. ఐపీఎల్ తర్వాత పాకిస్థాన్ సూపర్ లీగ్ ను ఎక్కువగా చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపిస్తారు. ఈ సారి రెండు లీగ్స్ క్లాష్ అవ్వడంతో క్రికెట్ ఫ్యాన్స్ కు డబుల్ కిక్ లభించనుంది. డిఫెండింగ్ ఛాంపియన్స్ గా ఇస్లామాబాద్ యునైటెడ్ బరిలోకి దిగుతుంది. టోర్నీ తొలి మ్యాచ్ లో లాహోర్ ఖలందర్స్ తో ఇస్లామాబాద్ యునైటెడ్ తలపడనుంది. రావల్పిండి వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. రావల్పిండి క్వాలిఫైయర్ 1తో సహా టోర్నమెంట్‌లోని 11 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనుంది. లాహోర్‌లోని ఐకానిక్ గడాఫీ స్టేడియంలో ఫైనల్, ఎలిమినేటర్స్ తో సహా మొత్తం 13 మ్యాచ్ లు జరుగుతాయి. కరాచీలోని నేషనల్ స్టేడియం, ముల్తాన్ చెరో ఐదు మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. మొత్తం 6 జట్లు (ఇస్లామాబాద్ యునైటెడ్, లాహోర్ ఖలందర్స్,పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్,కరాచీ కింగ్స్, ముల్తాన్ సుల్తాన్స్) టైటిల్ కోసం తలపడనున్నాయి.

# డేట్ లాక్ చేసుకోండి.. ఆ రోజే ఐపీఎల్‌లో తొలిసారి 300 పరుగులు: డేల్ స్టెయిన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ఇప్పటివరకు 300 పరుగులు నమోదు కాలేదు. చాలా జట్లు 250 కి పైగా పరుగులు సాధించినా 300 పరుగుల స్పెషల్ మ్యాజిక్ ఫిగర్ ను ఇప్పటివరకు ఏ జట్టు టచ్ చేయలేదు. బ్యాటింగ్ పిచ్ లు, బ్యాటర్ల హవాతో ఐపీఎల్ లో బౌలర్ల కష్టాలు కొనసాగుతున్నాయి. భారీ హిట్టింగ్ తో బౌలర్లను బ్యాటర్లు దడిపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ లో 300 పరుగులు బాదడం ఖాయంగా కనిపిస్తుంది. అభిమానులు కూడా ఈ సారి 300 పరుగులు వస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ మాటలకూ బలాన్ని చేకూరుస్తూ సౌతాఫ్రికా మాజీ స్టార్ బౌలర్ డేల్ స్టెయిన్ 300 పరుగులు ఏ మ్యాచ్ ద్వారా వస్తాయో జోస్యం తెలిపాడు.

“చిన్న జోస్యాన్ని చెబుతున్నాను. ఏప్రిల్ 17 న ఐపీఎల్ లో మనం తొలిసారి 300 పరుగుల స్కోర్ ను చూస్తాము”. అని స్టెయిన్ తన ఎక్స్ లో రాసుకొచ్చాడు. ఐపీఎల్ షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 17 న సన్ రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ముంబైలోని వాంఖడే స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిథ్యమిస్తుంది. ఇరు జట్లలో పవర్ ఫుల్ హిట్టర్లు ఉండడంతో స్టెయిన్ ఈ మ్యాచ్ లో 300 పరుగులు వస్తాయని అంచనా వేశాడు. హెడ్, అభిషేక్ శర్మ, క్లాసన్, ఇషాన్ కిషాన్, నితీష్ రెడ్డిలతో సన్ రైజర్స్ దుర్భేధ్యంగా ఉంది. మరోవైపు ముంబై జట్టులో రోహిత్ శర్మ, విల్ జాక్స్, సూర్య కుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య వంటి అంతర్జాతీయ స్టార్లు ఉన్నారు. ఆదివారం (మార్చి 23) సన్ రైజర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో ఏకంగా 528 పరుగులు నమోదయ్యాయి. ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో బ్యాటర్ల ధాటికి బౌలర్లు కుదేలయ్యారు. మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 286 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేజింగ్ లో రాజస్థాన్ రాయల్స్ 242 పరుగులు చేసింది. ఇప్పటివరకు ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డ్ సన్ రైజర్స్ పేరిట ఉంది. 2024 ఐపీఎల్ సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పై సన్ రైజర్స్ 287 పరుగులు చేసింది.

# ‘అఖండ 2’ బడ్జెట్ హద్దులు దాటుతుందా...?

నందమూరి బాలకృష్ణ హీరోగా ప్రస్తుతం ఫుల్ జోష్ మీద ఉన్నారు. ఆయన అఖండ సినిమా మొదలుకుని వరుసగా వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ సినిమాలతో హిట్‌ను సొంతం చేసుకున్నారు. కలెక్షన్స్ విషయం పక్కన పెడితే వరుసగా నాలుగు సినిమాలకు బాలకృష్ణ సక్సెస్ టాక్‌ను దక్కించుకున్నారు. ప్రస్తుతం ‘అఖండ 2’ సినిమాలో బాలయ్య నటిస్తున్న విషయం తెల్సిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న అఖండ 2 పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో సింహా, లెజెండ్, అఖండ సినిమాలు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ముఖ్యంగా అఖండ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో భారీ వసూళ్లను సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. అఖండ భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో అఖండ 2 సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. గత ఏడాది కాలంగా అఖండ 2 సినిమా గురించి నందమూరి అభిమానుల్లో చర్చ జరుగుతోంది. అదుగో ఇదుగో అంటూ అఖండ 2 గురించి పెద్ద ఎత్తున పుకార్లు షికార్లు చేశాయి. బోయపాటి శ్రీను షూటింగ్ ప్రారంభించినప్పటి నుంచి అంచనాలు పెంచే విధంగా ఏదో ఒక లీక్ ఇస్తూనే ఉన్నారు. సినిమా కోసం మహా కుంభమేళలో ప్రత్యేకంగా షూటింగ్ చేశారు. అంతే కాకుండా హిమాలయాల్లోనూ షూటింగ్ నిర్వహించడం ద్వారా అంచనాలు భారీగా పెంచారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రగ్యా జైస్వాల్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమాను 14 రీల్స్ బ్యానర్‌లో రామ్ ఆచంట, గోపీ ఆచంటలు నిర్మిస్తున్నారు. మొదట ఈ సినిమాను రూ.150 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారనే వార్తలు వచ్చాయి. అఖండ 2 సినిమాకి ఉన్న బజ్ నేపథ్యంలో ఎప్పటికప్పుడు సినిమా బడ్జెట్‌ను పెంచుతూ వచ్చారు. షూటింగ్ కార్యక్రమాలను ఎక్కడా రాజీ పడకుండా చేస్తున్న కారణంగా పూర్తి అయ్యేప్పటి వరకు రూ.175 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమాలో ఎస్ జే సూర్య, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో కావ్య థాపర్ కీలక పాత్రలో ‍నిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. అఖండ 2 సినిమాను 2025 సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. అఖండ 2 తాండవం అంటూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాలో తమిళ్ యంగ్ హీరో ఆది పినిశెట్టి నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కోసం బోయపాటి రాజీ పడకుండా భారీ ఖర్చుతో అతి పెద్ద సెట్స్ నిర్మాణం చేస్తున్నారు. సెట్స్ నిర్మాణం కారణంగా బడ్జెట్ పరిధి భారీగా పెరిగి పోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బాలకృష్ణ ప్రస్తుతం ఉన్న ఫామ్‌ను బట్టి చూస్తే అఖండ 2 కచ్చితంగా రూ.250 కోట్ల వసూళ్లు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. కనుక రూ.200 కోట్ల బడ్జెట్ అనేది అఖండ 2 సినిమాకు భారం కాకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



అందాల' రాశి' సౌందర్య లహరి





ముక్తి మోహన్ లుక్ మిమ్మల్ని ఫ్యాషన్‌తో ప్రేమలో పడేలా చేస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com